VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : మంగళవారం 07.07.2026

సంపుటి : 09 సంచిక : 28 , పేజీలు : 12 , వెలరూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



2

## ద్రౌపది ముర్ముతో విదేశీ దౌత్య ప్రతినిధుల భేటీ.. అధికార పత్రాల సమర్పణ

- రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్మును కలిసిన నలుగురు విదేశీ దౌత్య ప్రతినిధులు

# రాముడి పేరుతో అవినీతి

- అయోధ్య రామాలయ అవకతవకలపై బీజేపీ సమాధానం చెప్పాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్
- విరాళాలపై బీజేపీ వివరణ ఇవ్వాలని డిమాండ్
- దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వ్యాఖ్య
- అక్షింతల పేరుతో విరాళాలు సేకరించారని విమర్శ
- రాజకీయం కోసం రాముని పేరును వాడు కున్నారని ఆరోపణ
- భక్తి పేరుతో స్కాం జరిగిందని తీవ్ర వ్యాఖ్యలు
- మోదీ, అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్
- రాముడి హుండీ డబ్బు దుర్వినియోగ మైందని ఆరోపణ
- అయోధ్య ప్రజలే బీజేపీకి బుద్ధి చెప్పారని వ్యాఖ్య
- భక్తుల విశ్వాసాన్ని వమ్ము చేశారని మండిపాటు



హుస్నాబాద్ వెలుతురు జూలై 06:

శ్రీరామ జన్మభూమిలో రామమందిర నిర్మాణం కోసం దేశవ్యాప్తంగా భక్తులు తమ స్థోమత మేరకు విరాళాలు సమర్పించారని, ఆ పవిత్రమైన నిధుల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. రామమందిర నిర్మాణం కోసం ప్రజలు విశ్వాసంతో ఇచ్చిన విరాళాలను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు అత్యంత తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని అన్నారు.రాముని పేరుతో, అక్షింతల పేరుతో బీజేపీ నాయకులు దేశవ్యాప్తంగా విరాళాలు సేకరించారని, ఇప్పుడు ఆ నిధులపై అవినీతి ఆరోపణలు రావడం భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని విమర్శించారు. ఈ వ్యవహారంలో బీజేపీ వెంటనే స్పందించి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.రాజకీయం వేరు, భక్తి వేరని స్పష్టం చేసిన పొన్నం ప్రభాకర్.. రాజకీయ లబ్ధి కోసం రాముని పేరును బీజేపీ ఉపయోగించుకుందని ఆరోపించారు. రామమందిర విరాళాల వ్యవహారంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని అన్నారు.రాముడి హుండీలో భక్తులు సమర్పించిన విరాళాలను దుర్వినియోగం చేయడం దేశ ప్రజలకు అవమానకరమని ఆయన వ్యాఖ్యానించారు. భక్తి పేరుతో రాజకీయాలు చేసే వారి నిజస్వరూపాన్ని ప్రజలు గుర్తించాలని పిలుపునిచ్చారు.అయోధ్య ప్రజలే బీజేపీ నాయకుల వైఖరిని గుర్తించి ఆ పార్టీ ఎంపీని ఓడించారని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. దేవుడి పేరుతో ఎలాంటి అవినీతికీ తావు ఉండకూడదని, భక్తుల విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆయన అన్నారు.

## పర్యాటక అభివృద్ధిపై సీఎం ఫోకస్.. ప్రాజెక్టుల వేగవంతానికి ఆదేశాలు

- రాష్ట్ర పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష
- హైదరాబాద్ అటవీ భూముల్లో ఎకో టూరిజం అభివృద్ధికి కార్యాచరణ చేపట్టాలని ఆదేశాలు
- భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక
- గుర్రంగూడ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కుల అభివృద్ధికి సూచనలు



2

## దేశభక్తి నినాదం కాదు... త్యాగంలోనే కన్పిస్తోంది



2

- శ్యామా ప్రసాద్ ముఖర్జీ మరణమే నిదర్శనం
- ఆయన మరణం దేశ సమైక్యత కోసం చేసిన మహా త్యాగం
- ముఖర్జీ త్యాగం దేశభక్తుల హృదయాల్లో శాశ్వతం
- కొంతమంది పదవుల కోసం రాజకీయాలు చేస్తారు....రాజకీయాలను దేశసేవకు సాధనంగా చేసుకున్న మహనీయుడు ముఖర్జీ

## మౌలిక వసతుల ప్రాజెక్టులపై నితిన్ గడ్కరీ సమీక్ష..

- న్యూఢిల్లీలో ఎన్‌హెచ్ఎల్ఎంఎల్‌తో సమీక్ష నిర్వహించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కుల పురోగతిపై సమీక్ష
- రోప్‌వేలు, ఇంటర్‌మోడల్ స్టేషన్లు, వే సైడ్ అమెనిటీస్ పనులపై చర్చ
- దేశ రవాణా వ్యవస్థను ఆధునికీకరించే ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి
- అమలులో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం
- పెండింగ్ అంశాలను ప్రాధాన్యంగా పరిష్కరించాలని సూచన
- ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత వర్గాలకు ఆదేశాలు



2

## కేసీఆర్ అసెంబ్లీకి రావాలి కాళేశ్వరంపై వివరణ ఇవ్వాలి

- కేసీఆర్ తేదీ చెబితే ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించేందుకు సిద్ధం
- కాళేశ్వరం అవినీతి, ఇందిరమ్మ ఇళ్లపై ప్రజల ముందే చర్చిద్దాం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సిద్ధిపేట / హైదరాబాద్ వెలుతురు జూలై 06:

దేశంలోనే "ఎనిమిదో వింత"గా కాళేశ్వరం ప్రాజెక్టును ప్రచారం చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరం ఎందుకు కుంగిపోయిందో, వేల కోట్ల ప్రజాధనం ఎలా వృథా అయిందో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ తేదీ, సమయం సూచిస్తే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

▶ మిగతా 3లో

## రెండు లక్షల ఉద్యోగాల హామీపై శ్వేతపత్రం విడుదల చేయాలి: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

- సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ శాసనసభాపక్ష నేత బహిరంగ లేఖ
- 20 వేల పోలీస్ ఖాళీలు భర్తీ చేయాలని, జీఓ 46 రద్దు చేయాలని డిమాండ్
- నిరుద్యోగులపై నమోదైన కేసులు ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి



2

## లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల కేంద్రంగా తెలంగాణ



2

- మోడల్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌గా జహీరాబాద్ నిమ్జ్
- పారిశ్రామిక ప్రగతిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాల దుష్ప్రచారం
- దేశంలోనే మొదటి ఇంటిగ్రేటెడ్ ఆంకాలజీ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

## ఐటీ పార్క్ స్థానంలో డంప్ యార్డా?



- సిద్దాపూర్ డంప్ యార్డుపై హరీష్ రావు ఫైర్ 86 ఎకరాల డంప్ యార్డు నిర్ణయంపై ఆగ్రహం
- 20 గ్రామాల రైతులకు తీవ్ర నష్టమన్న హరీష్
- గుట్ట చెరువు కలుషితమయ్యే ప్రమాదమని ఆందోళన

2

- జహంగీర్ పీర్ దర్గాపైనా ప్రభావమని వ్యాఖ్య
- జీవో 641ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ

## 116 ఏళ్ల నవనీతమ్మకు శ్రీవారి వీఐపీ దర్శనం


- కాలినడకన వచ్చిన వృద్ధురాలికి ప్రత్యేక దర్శనం
- తితిదే ఛైర్మన్ చొరవతో దర్శన ఏర్పాట్లు



3

## అంతరిక్షంలోకి భారత శాస్త్రవేత్తల చిత్రాలు.. 'విక్రమ్1' ప్రయోగానికి సిద్ధం

- దేశ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగానికి రంగం సిద్ధం
- జులై 12 నుంచి ఆగస్టు 4 మధ్య 'మిషన్ ఆగమన్' నిర్వహణ




6

## ఒక్క కాలేజీ కూలిస్తే.. వంద నిర్మిస్తాం

- ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ సవాల్
- ఫాతిమా విద్యాసంస్థల భూ వివాదంపై బీజేపీ–ఎంఐఎం మధ్య మాటల యుద్ధం
- హైకోర్టు అభ్యంతరాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బండి సంజయ్



3

# పర్యాటక అభివృద్ధిపై సీఎం ఫోకస్.. ప్రాజెక్టుల వేగవంతానికి ఆదేశాలు

- తారామతి బారాదరి, దుర్గం చెరువును ఆకర్షణీయ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ఆదేశం
- మంజీరా, దిల్‌కుషా అతిథి గృహాల ఆధునికీకరణపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం
- వికారాబాద్ శ్రీ వీరభద్రస్వామి ఆలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేయాలని నిర్ణయం
- పురానాపూల్ వంటి వారసత్వ వంతెనలను పర్యాటక ప్రాంతాలుగా మార్చే ప్రణాళిక
- ఎకో టూరిజం ప్రాజెక్టుల అమలుకు ప్రత్యేక అధికారుల నియామకంపై ఆదేశాలు
- డిసెంబర్‌లో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించాలని సూచన



**హైదరాబాద్ వెలుతురు జూలై 06:**

రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సోమవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన సమీక్ష నిర్వహించారు.హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంత పరిధిలోని అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో సమన్వయం చేసి ఎకో టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయి పర్యాటక గమ్య స్థానాలుగా తీర్చిదిద్దాలని, గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం స్పష్టం చేశారు. తారామతి బారాదరిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. మంజీరా, దిల్‌కుషా అతిథి గృహాలను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను ప్రత్యేక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీఎం పేర్కొన్నారు. ముఖ్యంగా అక్కడి శ్రీ వీరభద్రస్వామి దేవాలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసి, ఆలయ నిర్వహణ కోసం ప్రత్యేక పాలక మండలిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.సీ.యూ.ఆర్.ఈ (CURE) పరిధిలో అర్బన్ ఫారెస్ట్ నమూనాలో ఎకో టూరిజం ప్రాజెక్టులను చేపట్టాలని, వాటి అమలుకు ప్రత్యేక అధికారులను నియమించి పనులను వేగవంతం చేయాలని సీఎం సూచించారు. నగరంలో చారిత్రక వారసత్వ సంపదగా నిలిచిన పురానాపూల్ వంటి వంతెనలను సంరక్షిస్తూ పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని, అవసరమైతే ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించి పర్యాటకులకు అనువైన వాతావరణం కల్పించాలని అధికారులకు ఆదేశించారు.పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు వచ్చే డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించాలని సీఎం సూచించారు. ఇందుకోసం వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కోసం ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ సమావేశంలో సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల ప్రాజెక్టులపై నితిన్ గడ్కరీ సమీక్ష..

- లాజిస్టిక్స్ సామర్థ్యం పెంపు, రవాణా వ్యయాల తగ్గింపే లక్ష్యమని వెల్లడి
- ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పించనున్నట్లు వ్యాఖ్య
- వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు ఈ ప్రాజెక్టులు కీలకమన్న గడ్కరీ

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 06:**

దేశవ్యాప్తంగా అమలవుతున్న కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిపై కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం న్యూఢిల్లీలో సమీక్ష నిర్వహించారు. నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎల్ఎంఎల్) అధికారులతో సమావేశమై మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కులు (ఎంఎంఎల్‌పీలు), రోప్‌వేలు, ఇంటర్‌మోడల్ స్టేషన్లు, వే సైడ్ అమెనిటీస్ ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించారు.ఈ ప్రాజెక్టులు దేశంలో తదుపరి తరం రవాణా మౌలిక వసతులకు పునాది వేస్తాయని గడ్కరీ పేర్కొన్నారు. వివిధ రవాణా వ్యవస్థల మధ్య సమన్వయాన్ని పెంచడంతో పాటు ఆర్థిక అవకాశాలను విస్తరించేందుకు, ప్రాంతీయ అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ఇవి దోహదపడతాయని తెలిపారు.

ప్రాజెక్టుల అమలుకు అడ్డంకిగా ఉన్న ప్రధాన సమస్యలను సమీక్షించిన గడ్కరీ, పెండింగ్ అంశాలను ప్రాధాన్యంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనులను వేగంగా పూర్తి చేయడం ద్వారా లాజిస్టిక్స్ సామర్థ్యం పెరగడంతో పాటు రవాణా ఖర్చులు తగ్గి, ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల సాధనలో ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# రెండు లక్షల ఉద్యోగాల హామీపై శ్వేతపత్రం విడుదల చేయాలి: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూలై 06:**



బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ ఇచ్చిన హామీకి సంబంధించి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలని కోరారు.రాష్ట్రంలో దాదాపు 20 వేల పోలీస్ ఖాళీలు ఉన్నప్పటికీ ప్రభుత్వం కేవలం 7,437 పోస్టుల భర్తీకే ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.జీఓ 46 కారణంగా గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని, ప్రాంతాల వారీ కటాఫ్ విధానం వల్ల ప్రతిభావంతులైన అభ్యర్థులు నష్టపోతున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు జీఓ 46ను రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయలేదని విమర్శించారు. అలాగే నిరుద్యోగులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఐటీ పార్క్ స్థానంలో డంప్ యార్డా?

- ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రి
- డంప్ యార్డు రద్దు చేయకుంటే ఉద్యమమేనని హెచ్చరిక

**హైదరాబాద్ వెలుతురు జూలై 06:**

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్‌లో డంప్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా వ్యతిరేకించారు. డంప్ యార్డు ఏర్పాటుతో నష్టపోతున్న స్థానిక రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హైదరాబాద్‌లో హరీష్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. తమ జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని, ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకోవాలని కోరారు.రైతుల వినతిపై స్పందించిన హరీష్ రావు.. సిద్దాపూర్ గ్రామంలో 86 ఎకరాల్లో డంప్ యార్డు ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెం.641 జారీ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. పచ్చని వ్యవసాయ భూముల మధ్య, జనావాసాలకు సమీపంలో డంప్ యార్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం ప్రభుత్వ అనాలోచిత వైఖరికి నిదర్శనమని అన్నారు.డంప్ యార్డు ఏర్పాటు వల్ల సిద్దాపూర్‌తో పాటు దాదాపు 20 గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోతారని హరీష్ రావు పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలు పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, హైదరాబాద్ నగరానికి అవసరమైన కూరగాయలను ఇక్కడి రైతులే సాగు చేస్తున్నారని తెలిపారు.డంప్ యార్డు ప్రతిపాదిత ప్రాంతానికి ఆనుకుని ఉన్న గుట్ట చెరువు నీటితో రైతులు సాగు చేస్తున్నారని, అక్కడ చెత్త నిల్వ చేస్తే చెరువు నీరు కలుషితమై సాగునీటితో పాటు తాగునీటికీ తీవ్ర ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా సమీపంలోని జహంగీర్ పీర్ దర్గాకు వచ్చే భక్తులపై కూడా కాలుష్య ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇదే ప్రాంతంలోని సర్వే నంబర్లు 252, 278, 361లో ఉన్న 334 ఎకరాల్లో ఐటీ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించామని హరీష్ రావు గుర్తు చేశారు. ఐటీ పార్క్ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి ప్రాంత అభివృద్ధికి బాటలు వేయాలని భావించామని చెప్పారు.ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన ప్రాంతంలో డంప్ యార్డు ఏర్పాటు చేసి ప్రజల జీవితాలను దెబ్బతీయాలని చూడటం బాధాకరమని ఆయన విమర్శించారు. ప్రభుత్వం డంప్ యార్డులను ఏర్పాటు చేయాల్సి వస్తే జనావాసాలు, వ్యవసాయ భూములు లేని ప్రాంతాలను ఎంపిక చేయాలని సూచించారు.సిద్దాపూర్ డంప్ యార్డు ఏర్పాటుకు సంబంధించిన జీవోను ప్రభుత్వం వెంటనే బేషరతుగా ఉపసంహరించుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. లేదంటే నష్టపోతున్న 20 గ్రామాల ప్రజల తరఫున బీఆర్ఎస్ పెద్దఎత్తున ఉద్యమం చేపడుతుందని, రైతులకు అండగా నిలిచి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# దేశభక్తి నినాదం కాదు...త్యాగంలోనే కన్పిస్తోంది

- శ్యామాప్రసాద్ ఆశయాలను తూ.చ తప్పక అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం
- 370 ఆర్టికల్ రద్దు, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా ముఖర్జీ ఆకాంక్షలే

**హైదరాబాద్ వెలుతురు జూలై 06:**

''దేశం కోసం మాట్లాడినవారు ఎందరో ఉన్నారు. దేశం కోసం ప్రాణం ఇచ్చినవారు చాలా కొద్దిమంది ఉంటారు. అందులో శ్యామా ప్రసాద్ ముఖర్జీ పేరు చిరస్థాయిగా నిలిచి పోతుంది.''అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. దేశం కోసం బలిదానం చేసిన మహనీయుల త్యాగాన్ని మరచిపోయిన జాతి తన భవిష్యత్తును కూడా కోల్పోతుందనే విషయాన్ని గుర్తు చేశారు. శ్యామా ప్రసాద్ ఆశయాలను, ఆకాంక్షలను నరేంద్రమోదీ ఆధ్వర్యంలో నితిన్ నబిన్ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ తూ.చ తప్పకుండా అమలు చేస్తోందని తెలిపారు. భారత్ కు అణ్వస్త్రాలను సమకూర్చడం, 370 ఆర్టికల్ ను రద్దు చేసి కాశ్మీర్ ను భారత్ లో అంతర్భాగం చేయడం తోపాటు మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి పథకాల అమలుతో స్వయం సమృద్ధి దేశంగా భారత్ ను తీర్చిదిద్దుతుండటమే ఇందుకు నిదర్శమని పేర్కొన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ సోమవారం రోజున ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం శ్యామా ప్రసాద్ త్యాగాలను గుర్తు చేసుకుంటూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యాంశాలు.భారతదేశ అసలు సిసలైన హీరో శ్యామాప్రసాద్ ముఖర్జీ. దేశం కోసం యుద్ధం చేయడానికి సిద్దంగా ఉండాలని జన సంఘ్ కార్యకర్తలను పిలుపునివ్వడమే కాకుండా కార్యకర్తలకు తుపాకీలిచ్చి పాకిస్తాన్ పై యుద్ధం చేయడానికి పంపిన వీరుడు. పార్టీ, రాజకీయాల కంటే దేశమే ఫస్ట్ అని చాటి చెప్పిన గొప్ప నేత శ్యామాప్రసాద్ ముఖర్జీ. దేశం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ అధ్యక్షులు, పార్లమెంట్ లో ఏకైక ప్రతిపక్ష నేత కూడా ఆయనే.కాశ్మీర్ వెళ్లడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పర్మిట్ కార్డు తప్పనిసరి చేస్తే నా దేశం వెళ్లడానికి పర్మిట్ కార్డు ఎందుకని ప్రశ్నిస్తూ 'ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిషాన్ నహీ నహీ ఛలేగా...నహీ ఛలేగా' అంటూ 370 ఆర్టికల్ రద్దు కోసం పోరాడిన మహనీయుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ. ఆనాడు పర్మిట్ అవసరం లేదని పేర్కొంటూ కశ్మీర్ బయలుదేరిన శ్యామా ప్రసాద్ ముఖర్జీని నాటి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి కనీస సౌకర్యాలు లేని జైల్లో నిర్బంధానికి గురి చేసింది. ఆనాడు అటువైపుగా వెళుతున్న నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ముఖర్జీని పరామర్శించాలని సోయి లేకుండా వెళ్లిపోయారు. ఆ నిర్బంధంలోనే అనుమానాస్పద స్థితిలో ముఖర్జీ మరణిస్తే కనీసం విచారణ జరపని అమానవీయ ప్రభుత్వం కాంగ్రెస్ ది. ఆయన చనిపోయాక కాశ్మీర్ కు వెళ్లడానికి వీసా తప్పనిసరి అనే విధానాన్ని నెహ్రూ ప్రభుత్వం రద్దు చేసింది. ఇది బీజేపీ సాధించిన తొలి విజయం.స్వతంత్ర ఫలాలు అట్టడుగు స్థాయి వరకు తీసుకెళ్లాలని పార్లమెంట్ లో పోరాడితే... డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సైతం శ్యామాప్రసాద్ కు మద్దతు తెలిపారంటే ఆయన గొప్పతనం, కమిట్ మెంట్ ను అర్థం చేసుకోవచ్చు.

ఆనాడు పార్లమెంట్ లో నెహ్రూ మాట్లాడుతూ 'నీ పార్టీ ఎంత? నువ్వెంత? నీ పార్టీని మొత్తం నాశనం చేస్తా'నని చెబితే.... అందుకు ప్రతిగా నా పార్టీని నాశనం చేయడం సంగతి తరువాత...''నాశనం చేస్తాననే మీ ఆలోచననే నాశనం చేస్తా''నంటూ ధీటుగా బదులిచ్చిన నాయకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ. భారతదేశ రక్షణ కోసం అణ్వస్త్రాలు ఉండాలని ఆకాంక్షించిన దూరదృష్టి కలిగిన నాయకుడు.దేశం కోసం చనిపోవడం గొప్ప విషయం. కానీ దేశం ఒక్కటిగా ఉండాలని కోరుకుంటూ ప్రాణాలు అర్పించడం మరింత గొప్ప విషయం. ఆ త్యాగానికి ప్రతిరూపం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ. కొంతమంది పదవుల కోసం రాజకీయాలు చేస్తారు. కానీ రాజకీయాలను దేశసేవకు ఒక సాధనంగా మలుచుకున్న మహనీయుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ. దేశభక్తి అనేది నినాదాల్లో కాదు, త్యాగంలో కనిపిస్తోందనడానికి ముఖర్జీ జీవితమే నిదర్శనం. శ్యామా ప్రసాద్ మరణించినా ఆయన ఆలోచనలు, ఆశయాలు మాత్రం సదా చిరస్మరణీయం.ఆ మహనీయుడి ఆలోచనలను, ఆశయాలను, ఆకాంక్షలను భారతీయ జనతా పార్టీ తూ.చ తప్పకుండా అమలు చేస్తోంది. ముఖర్జీ ఆకాంక్షలకు అనుగుణంగా వాజ్ పేయి ప్రభుత్వం అణ్వాయుధాలను సమకూరిస్తే... 370 ఆర్టికల్ ను రద్దు చేసి శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలను నరేంద్రమోదీ నెరవేర్చారు. దేశ స్వాలంబన కోసం శ్యామా ప్రసాద్ ముఖర్జీ పరితపిస్తే మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా పేరుతో దేశం స్వయం సమృద్ధి సాధించేలా ఆచరణలోకి తీసుకొచ్చిన గొప్ప నేత నరేంద్రమోదీ. దేశ విభజన సమయంలో అనుకోని పరిస్థితుల్లో విదేశాలకు వెళ్లి తిరిగి మాతృభూమికి వచ్చిన వారికి అండగా ఉండేందుకు పౌరసత్వ సవరణ బిల్లును తీసుకొచ్చిన ప్రభుత్వం నరేంద్రమోదీదే. శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాల మేరకు మధ్య దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వ ఫలాలను నేరుగా లబ్దిదారులకు అందిస్తున్న ప్రభుత్వం కూడా నరేంద్రమోదీదే. శ్యామా ప్రసాద్ ఆశయాలు, ఆకాంక్షలను అమలు చేయడమే ఆయనకు అందించే ఘనమైన నివాళి.

# లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల కేంద్రంగా తెలంగాణ

**సిద్దిపేట జిల్లా వెలుతురు జూలై 06:**



ఆరోగ్య రంగంలో వేగంగా చోటు చేసుకుంటున్న మార్పులను అవకాశాలుగా అందిపుచ్చుకునేలా... తెలంగాణను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పరిశోధన, సాంకేతికత, ఏఐ, అధునాతన తయారీ, నైపుణ్యాభివృద్ధిని సమన్వయం చేస్తూ... భవిష్యత్తులో హెల్త్ కేర్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా సమగ్ర ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం కరకపట్లలోని బయోటెక్ పార్క్ ఫేజ్ – 3 లో రూ.800 కోట్ల పెట్టుబడితో సిరో ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన దేశంలోనే మొదటి ఇంటిగ్రేటెడ్ ఆంకాలజీ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... పారిశ్రామిక ప్రగతిలో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. జహీరాబాద్ నిమ్జ్ ను మోడల్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించామన్నారు. రాష్ట్రంలో 'గ్రీన్ ఫార్మా' అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని... పర్యావరణహిత పద్ధతుల్లో ఔషధాలను ఉత్పత్తి చేసేలా పరిశ్రమలను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా వాడుకలోకి వచ్చేలా... తెలంగాణ నుంచే ఒక కొత్త మాలిక్యూల్ ఆవిష్కృతం కావాలని ఆకాంక్షించారు.

ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. తెలంగాణ రైజింగ్–2047, నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ ద్వారా పరిశోధన నుంచి ఉత్పత్తి వరకు అన్ని దశలను అనుసంధానించేలా ఒక ప్రత్యేక వ్యవస్థను నిర్మిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా బయోలాజిక్స్, బయోసిమిలర్స్, సెల్ అండ్ జీన్ థెరపీలు, ఏఐ, డిజిటల్ హెల్త్ తదితర అత్యాధునిక రంగాలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ, హిల్ట్ పాలసీలపై ప్రతిపక్షాలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. రెండున్నరేళ్లలో పారిశ్రామికంగా రాష్ట్రం సాధించిన ప్రగతిని చూసి ఓర్వలేకే ప్రజలను తప్పుదోవ పట్టించేలా అదే పనిగా మాపై బురద చల్లుతున్నాయన్నారు. తాజాగా ప్రారంభించిన ఈ ప్లాంట్ లో అత్యాధునిక కంటైన్‌మెంట్ టెక్నాలజీని ఉపయోగించి... క్యాన్సర్ నివారణకు సంబంధించిన ఓరల్ ఆంకాలజీ ఔషధాలు, స్టెరిలైజ్డ్ ఇంజెక్టబుల్స్, లైయోఫిలైజ్డ్ పౌడర్ ఇంజెక్షన్లు, సాఫ్ట్ జెల్ క్యాప్సూల్స్ ను ఉత్పత్తి చేస్తారన్నారు. ఇక్కడ కొత్తగా 500 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు. దేశీయ ఫార్మా రంగ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ స్థానాన్ని ఇది మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కంపెనీ ప్రతినిధులు డా.గోవింద రెడ్డి, డా.మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ద్రౌపది ముర్ముతో విదేశీ దౌత్య ప్రతినిధుల భేటీ.. అధికార పత్రాల సమర్పణ

- అధికారిక క్రెడెన్షియల్స్ సమర్పించిన హై కమిషనర్లు, రాయబారులు
- మొజాంబిక్ హై కమిషనర్ ఆర్మాండో పెడ్రో ముయువానే జూనియర్ హాజరు
- నికరాగువా రాయబారి నడెస్కా ఇమారా కత్‌బర్ట్ కార్ల్సన్ అధికార పత్రాల సమర్పణ
- సురినామ్ రాయబారి హనిషా జైరామ్‌తో రాష్ట్రపతి సమావేశం
- గాబోనీస్ రిపబ్లిక్ హై కమిషనర్ ఔరేలియన్-మార్సెల్ మింట్సా న్స్యమా హాజరు
- రాష్ట్రపతి భవన్‌లో అధికారిక కార్యక్రమం నిర్వహణ

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 06:**

రాష్ట్రపతి ద్రౌపది ముర్మును నలుగురు విదేశీ దౌత్య ప్రతినిధులు సోమవారం రాష్ట్రపతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా వారు తమ అధికారిక క్రెడెన్షియల్స్‌ను రాష్ట్రపతికి సమర్పించారు.మొజాంబిక్ గణరాజ్య హై కమిషనర్ ఆర్మాండో పెడ్రో ముయువానే జూనియర్, నికరాగువా గణరాజ్య రాయబారి నడెస్కా ఇమారా కత్‌బర్ట్ కార్ల్సన్, సురినామ్ గణరాజ్య రాయబారి హనిషా జైరామ్, గాబోనీస్ రిపబ్లిక్ హై కమిషనర్ ఔరేలియన్–మార్సెల్ మింట్సా న్స్యమా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తమ అధికార పత్రాలను అందజేశారు.



రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమం అధికారిక లాంఛనాలతో నిర్వహించబడింది. విదేశీ దౌత్య ప్రతినిధులను రాష్ట్రపతి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారత్‌తో ఆయా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, దౌత్య సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పరస్పర సహకారం కొనసాగుతుందనే ఆశాభావం వ్యక్తమైంది.

# వైఎస్ఆర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

హైదరాబాద్ వెలుతురు జూలై 06:

ఈ నెల జూలై 8న మాజీ ముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి జయంతి సందర్భంగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులు అర్పించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ పిలుపు నిచ్చారు.ఆయన మాట్లాడుతూ, డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, రెండుసార్లు పీసీసీ అధ్యక్షుడిగా, ఎంపీగా, ప్రతిపక్ష నాయకుడిగా అనేక కీలక బాధ్యతలను నిర్వహించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత అని



కొనియాడారు.

అలాంటి ప్రజానాయకుడికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృతజ్ఞతాభావంతో ఘన నివాళులు అర్పించాలని కోరారు.ముఖ్య మంత్రిగా డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ధూపదీప నైవేద్యం వంటి సంక్షేమ పథకాలతో పాటు ప్రజా సంక్షేమానికి ఎన్నో చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలించిన ఆయనను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నటికీ మరువరని అన్నారు.డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి జయంతి సందర్భంగా ప్రతి గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమ తమ ప్రాంతాల్లో నివాళి కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారికి తీరని ఆకాంక్ష ఏదైనా ఉంటే, అది శ్రీ రాహుల్ గాంధీ గారిని దేశ ప్రధానమంత్రిగా చూడడమేనని ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు. అదే లక్ష్యంతో తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారి అధ్యక్షతన పార్టీ బలోపేతానికి కృషి జరుగుతోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలిచేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలు పునిచ్చారు. వైఎస్ఆర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, ఆయనకు ఘనమైన నివాళులు అర్పించడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు.



పి. ప్రసన్న కుమార్ శర్మ,
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి

# ప్రభుత్వ విప్‌ల ప్రత్యేక కార్యాలయాల ప్రారంభం







- మీడియా అడ్వైజర్ కమిటీ కార్యాలయాన్నీ
- ప్రారంభించిన మంత్రి పొంగులేటి
- ప్రభుత్వ విప్‌లకు అసెంబ్లీ ప్రాంగణంలో ప్రత్యేక కార్యాలయాలు ప్రారంభం
- ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే వేముల వీరేశంకు కార్యాలయాల కేటాయింపు
- కార్యాలయాలను ప్రారంభించి విప్‌లకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి
- శాసనసభ నిర్వహణలో విప్‌ల పాత్ర అత్యంత కీలకమని వ్యాఖ్య
- సభా కార్యక్రమాలు సజావుగా సాగేలా సమన్వయం చేయాలని సూచన
- సభ్యులకు అవసరమైన మార్గనిర్దేశం చేయాలని విప్‌లకు పిలుపు
- మీడియా అడ్వైజర్ కమిటీ కార్యాలయాన్నీ ప్రారంభించిన మంత్రి
- కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన పొంగులేటి

హైదరాబాద్ వెలుతురు జూలై 06:

ప్రభుత్వ విప్‌లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే వేముల వీరేశంకు అసెంబ్లీ ప్రాంగణంలో కేటాయించిన ప్రత్యేక కార్యాలయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్‌లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాసనసభ కార్యకలాపాల నిర్వహణలో వారి పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.శాసనసభ కార్యక్రమాలను సమర్థ వంతంగా నిర్వహించడంలో విప్‌లు బాధ్యతాయుతంగా వ్యవహరిం చాలని మంత్రి సూచించారు. సభ్యులకు అవసరమైన మార్గనిర్దేశం చేయడంతో పాటు, సభా కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా జరిగేలా సమన్వయం చేయాలని కోరారు. తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ శాసనసభ గౌరవాన్ని మరింత పెంచాలని ఆకాంక్షించారు.అనంతరం శాసనసభ ప్రాంగణంలో మీడియా అడ్వైజర్ కమిటీ కార్యాలయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాసనసభ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు సమ ర్థవంతంగా చేరవేయడంలో మీడియా అడ్వైజర్ కమిటీ కీలక పాత్ర పోషించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, నాయకులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌కు వ్యవసాయంపై అవగాహన లేదు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ లక్ష్మణ్ కుమార్ విమర్శలు
- కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని ఆరోపణ
- కేటీఆర్‌కు వ్యవసాయంపై కనీస అవగాహన లేదని వ్యాఖ్య
- అమెరికా నుంచి వచ్చి తండ్రి వల్లే ప్రజాప్రతినిధి అయ్యారని విమర్శ
- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఖజానా ఖాళీ అయిందని ఆరోపణ
- ఆర్థిక సంక్షోభంలోనూ కాంగ్రెస్ హామీలు అమలు చేస్తోందని వెల్లడి
- రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న మంత్రి
- బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని వ్యాఖ్య
- 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా
- ప్రజలు కాంగ్రెస్ పాలనకు మరోసారి మద్దతు ఇస్తారని విశ్వాసం

హైదరాబాద్ వెలుతురు జూలై 06:

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం కమిషన్ల కోసమే నిర్మించారని ఆరోపించారు. అమెరికా నుంచి వచ్చి తండ్రి కారణంగానే ప్రజాప్రతినిధి అయిన కేటీఆర్‌కు వ్యవసాయంపై కనీస అవగాహన లేదని విమర్శించారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారని, ఆర్థిక సంక్షోభ పరిస్థితులు సృష్టించారని మంత్రి ఆరోపించారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు.రైతుల సంక్షేమం, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును విశ్వసిస్తున్నారని, 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



# 116 ఏళ్ల నవనీతమ్మకు శ్రీవారి వీఐపీ దర్శనం

- కుటుంబ సభ్యులతో కలిసి బ్రేక్ దర్శనం
- వేదాశీర్వచనంతో ఘనంగా సత్కరించిన పండితులు
- పట్టువస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసిన ఈవో
- వృద్ధురాలి పాదాలకు నమస్క రించిన ఈవో
- సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో
- తమిళనాడుకు చెందిన నవనీ తమ్మగా గుర్తింపు
- విజిలెన్స్ ద్వారా వివరాలు సేకరించిన తితిదే
- భక్తికి తితిదే ప్రత్యేక గౌరవం

తిరుపతి వెలుతురు జూలై 06:

శ్రీవారి దర్శనం కోసం 116 ఏళ్ల వయసులోనూ కాలినడకన తిరుమలకు చేరుకున్న వృద్ధురాలు నవనీతమ్మకు తితిదే ప్రత్యేక గౌరవం తెలిపింది. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు చొరవతో ఆమెతో పాటు కుటుంబ సభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాటు చేశారు. అధికారులు వృద్ధురాలిని దగ్గరుండి శ్రీవారి దర్శనానికి తీసుకెళ్లి అన్ని ఏర్పాట్లు చేశారు.దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు నవనీతమ్మకు వేదా శీర్వచనం చేశారు. తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర ఆమెకు పట్టువస్త్రం కప్పి, తీర్థప్ర సాదాలు అందజేశారు. అనంతరం వృద్ధురాలి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకోవడం విశేషంగా నిలిచింది.నవనీతమ్మ శనివారం అలిపిరి నడక మార్గం ద్వారా తిరుమలకు చేరుకున్నారు. ఆమె నడుచుకుంటూ వస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాం శమైంది. తొలుత ఆమె కర్ణాటకకు చెందిన వారిగా ప్రచారం జరిగినప్పటికీ, తితిదే విజిలెన్స్ సిబ్బంది విచారణ చేపట్టి తమిళనాడుకు చెందిన నవనీతమ్మగా గుర్తించారు. ప్రస్తుతం తిరుపతి జీవకోనలో బంధువుల వద్ద ఉంటున్నట్లు ఛైర్మన్‌కు సమాచారం అందించారు.ఈ వివరాలు తెలిసిన వెంటనే బీఆర్ నాయుడు స్పందించి నవనీతమ్మతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించాలని అధి కారులను ఆదేశించారు. దీంతో తితిదే అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఆమెకు అత్యంత గౌరవప్రదంగా శ్రీవారి దర్శనం కల్పించారు. 116 ఏళ్ల వయసులోనూ శ్రీవారిపై ఆమె చూపిన అపార భక్తి, సంకల్పం పలువురిని భావోద్వేగానికి గురిచేస్తోంది.

# కేసీఆర్ అసెంబ్లీకి రావాలి కాళేశ్వరంపై...

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం సిద్ధిపేట జిల్లా ములుగు మండలంలో సహచర మంత్రి వివేక్ వెంకటస్వామి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టింది మీరే... కూలింది మీ హయాంలోనే .. ఇప్పుడు మళ్లీ అక్కడికి వెళ్లి గొప్పలు చెప్పుకోవడం కూడా మీరే. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధమేంటి?" అని ప్రశ్నించారు.ప్రతి పేదవాడి చెమటోడ్చి చెల్లించిన పన్నుల డబ్బుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత లేక కుంగిపోతే, దానికి బాధ్యత వహించాల్సింది బీఆర్ఎస్ నాయకత్వమేనని అన్నారు. గోదావరి జలాలను కృష్ణా పరివాహక ప్రాంతాలకు తరలించే పేరుతో నిర్మించిన ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేసి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.ప్రభుత్వంపై ఎన్ని నిరాధార ఆరోపణలు చేసినా ప్రజలు వాటిని తిరస్కరిస్తూనే ఉన్నారని, అధికార దాహంతో చేస్తున్న రాజకీయాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతున్నారని అన్నారు. నిజంగా ప్రజాహితం కోసం సూచనలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీ వేదిక సిద్ధంగా ఉందని, అక్కడే అన్ని అంశాలపై బహిరంగంగా చర్చిద్దామని కేసీఆర్‌కు సవాల్ విసిరారు.రాష్ట్రంలో ఇప్పటికీ 32 వేల కుటుంబాలు పూరిగుడిసెల్లో జీవిస్తు న్నాయని ప్రభుత్వం గుర్తించిందని, రెండో విడత నుంచి నాలుగో విడత వరకు వారికి అత్యంత ప్రాధాన్యంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధిపేటతో పాటు కొద్ది ప్రాంతాల్లో మాత్రమే ఇళ్లు నిర్మించి, మిగిలిన నియోజకవ ర్గాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. నిర్మించిన ఇళ్లను కూడా అసంపూర్తిగా వదిలేసిందని అన్నారు. గత పదేళ్లలో ప్రతి ఏడాది లక్ష ఇళ్లు నిర్మించి ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు.ప్రస్తుతం మెదక్, హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేస్తున్నామని, మహిళల సాధికారతకు ప్రాధాన్యమిస్తూ ఆడబిడ్డల పేరుతో ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని చెప్పారు.రాష్ట్రంలో తొలి విడత ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే లక్షా 30 వేల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 70 నుంచి 75 వేల ఇళ్లు శ్లాబ్ దశకు చేరుకున్నాయని తెలిపారు. కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు.మొదటి విడత విజయవంతం కావడంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టారని, ఈ విడతలో రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ప్రతి నియోజక వర్గంలో రెండు వేల ఇళ్లు నిర్మించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. ఇందులో 1,500 కొత్త ఇళ్లతో పాటు గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 500 రేకుల ఇళ్లు, మొండిగోడల ఇళ్ల పూర్తి కోసం కూడా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి తెలిపారు.

# ఒక్క కాలేజీ కూలిస్తే.. వంద నిర్మిస్తాం


- ఒవైసీకి ఒక న్యాయం.. ఇతరులకు మరో న్యాయమా అని విమర్శ
- బీజేపీ ఆరోపణలకు బదులిచ్చిన అక్బరుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్ వెలుతురు జూలై 06:




తమ విద్యాసంస్థలను ఎలా కాపాడుకోవాలో తమకు తెలుసని స్పష్టం విద్యా సేవలను ఎవరూ అడ్డుకోలేరని వ్యాఖ్య భూ వివాదంపై రాజకీయ విమర్శలు మరింత ముదిరిన వేళ స్పందన ఫాతిమా విద్యాసంస్థల భూ వివాదం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ అంశంపై బీజేపీ, ఎంఐఎం నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. హైకోర్టు అభ్యంతరాల నేపథ్యంలో ప్రభుత్వం ఒవైసీకి ఒక న్యాయం, ఇతరులకు మరో న్యాయం చేస్తోందా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం వివక్షతో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు.దీనిపై స్పందించిన ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. తమ విద్యాసంస్థలను ఎలా కాపాడు కోవాలో తమకు తెలుసని, ఒక్క కాలేజీ కూల్చితే వంద విద్యాసంస్థలు నిర్మిస్తామని సవాల్ విసిరారు.ఫాతిమా విద్యాసంస్థల భూ వివాదం నేపథ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగు తుండగా, ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో మరింత వేడెక్కుతోంది.

# అనుకరణ ఒక తీపి విషం.. స్వతంత్రతే ప్రగతికి అసలైన గీటురాయి!



నవ సమాజ నిర్మాణంలో ప్రతి మనిషి ఒక విలక్షణమైన సృష్టి. మనిషి పుట్టుకతోనే తనదైన ఒక ప్రత్యేకమైన ముద్రతో, విభిన్నమైన మానసిక ప్రవృత్తితో ఈ భూమిపైకి వస్తాడు. ఒక వ్యక్తి వేలిముద్ర ఎలాగైతే ప్రపంచంలో మరే ఇతర వ్యక్తితోనూ సరిపోలదో, అలాగే అతని ఆలోచనా విధానం, జీవితం పట్ల దృక్పథం, అంతర్గత సృజనశక్తి కూడా అంతే విలక్షణంగా, అనన్యంగా ఉంటాయి. అయితే, నేటి సమాజంలో మనం గమనిస్తున్న ఒక విషాద కరమైన పోకడ ఏమిటంటే ప్రతి ఒక్కరూ తమ సహజత్వాన్ని కోల్పోయి, మరొకరిలా మారాలని తీవ్రంగా తపిస్తున్నారు. ఎవరో సాధించిన విజయాన్ని చూసి, వారి బాహ్య రూపాన్ని, మాటతీరును, ఆఖరికి వారి వ్యక్తిగత జీవనశైలిని గుడ్డిగా అనుకరించడం నేడు ఫ్యాషన్‌గా మారింది. ఈ ధోరణి మనిషిలో అంతర్గతంగా ఉన్న అసలైన మేధో సంపత్తిని, వైయుక్తిక వ్యక్తిత్వాన్ని నెమ్మదిగా కాలరాసేస్తోంది. అనుకరణ అనేది ఒక నయవంచక తీపి విషం లాంటిది. ఇది ప్రారంభంలో ఎంతో సౌకర్యంగా, సురక్షితంగా అనిపించినప్పటికీ, అంతిమంగా మనిషిని అతని స్వంత అస్తిత్వం, ఆత్మగౌరవం నుంచే శాశ్వతంగా దూరం చేస్తుంది. సామాజిక శాస్త్రవేత్తల విశ్లేషణ ప్రకారం, అనుకరణ అనే అలవాటు ఒక రకమైన తీవ్రమైన ఆత్మన్యూనతా భావం, అంతర్గత భయం నుంచి ఉద్భవిస్తుంది. సమాజంలో విమర్శకు గురవుతామనే భయం, తోటి వారిచే తిరస్కరణకు గురవుతామనే ఆందోళన, సమాజం నిర్దేశించిన మూస గుంపు నుంచి వేరుపడితే ఒంటరైపోతామనే అభద్రతా భావం మనిషిని ఈ దారికి నెడుతున్నాయి. ఈ భయంతోనే మనిషి తన స్వంత వినూత్న ఆలోచనలను అణచివేసుకుంటున్నాడు. కేవలం సమాజం ఆమోదించే సాంప్రదాయక మార్గంలోనే నడవాలని తాపత్రయపడుతుంటాడు. కానీ ఇలా చేయడం వల్ల సమాజానికి జరిగే నష్టం అంతా ఇంతా కాదు. అతని లోపల దాగి ఉన్న అద్వితీయమైన కోణం, అతనికి మాత్రమే సొంతమైన సృజనాత్మక దృష్టికోణం క్రమంగా మసకబారిపోయి, చివరికి పూర్తిగా అంతరించిపోతుంది. కాలక్రమేణా ఆ వ్యక్తి అసలు తానెవరో, తన స్వీయ సామర్థ్యం ఏమిటో కూడా మరిచిపోయే ప్రమాదం ఉంది. ఉదాహరణకు, ఒక వర్ధమాన కళాకారుడు ప్రసిద్ధుడైన మరొక కళాకారుడి శైలిని పూర్తిగా నకలు చేస్తే, అతని స్వంత గొంతు ఎప్పటికీ లోకానికి వినిపించదు. ఒక నవలా రచయిత మరొకరి భాషను, శైలిని అరువు తెచ్చుకుంటే, అతని స్వంత జీవిత అనుభవాలు, సామాజిక పరిశీలనలు ఆ కథల్లో ఎన్నటికీ ప్రతిఫలించవు. మనం ప్రపంచ చరిత్ర పుటలను ఒకసారి తిరగేస్తే, జగత్ప్రసిద్ధులైన గొప్ప వ్యక్తులందరూ తమదైన సరికొత్త మార్గంలో నడిచినవారే తప్ప ఇతరులను అనుసరించిన వారు కారు. వారు ఎవరినీ అనుకరించలేదు, పైగా వైవిధ్యమైన తమదైన ఒరవడిని సృష్టించి యుగకర్తలుగా నిలిచారు. అందుకే వారు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయారు. అనుకరించే గుణం ఉన్నవారు ఎప్పుడూ ఇతరుల నీడలుగానే మిగిలిపోతారు తప్ప, ఎన్నటికీ స్వయంప్రకాశిత వెలుగుగా మారలేరనేది అక్షర సత్యం.స్వతంత్ర చింతన సృజనాత్మకతకు ప్రాణాధారం ఏదైనా ఒక రంగంలో సృజనాత్మకత అనేది కేవలం సంపూర్ణ స్వేచ్ఛా వాతావరణంలో మాత్రమే వికసిస్తుందని మేధావులు స్పష్టం చేస్తున్నారు. ఒక వృక్షం తన సహజ సిద్ధమైన అటవీ వాతావరణంలో స్వేచ్ఛగా పెరిగినప్పుడే దాని కొమ్మలు, రెమ్మలు అన్ని దిశలలో విస్తరించి, పచ్చదనంతో కళకళలాడుతాయి. అదే మహావృక్షాన్ని తెచ్చి ఒక ఇరుకైన కుండీలో బోన్సాయ్‌లా బంధిస్తే, దాని సహజ ఎదుగుదల పూర్తిగా కుంటుపడుతుంది. మనిషి మేధో వికాసం కూడా సరిగ్గా అటువంటిదే. వ్యక్తికి స్వతంత్రంగా ఆలోచించే సంపూర్ణ అవకాశం, ప్రోత్సాహం లభించినప్పుడే సమాజానికి ఉపయోగపడే సరికొత్త ఆవిష్కరణలు, విప్లవాత్మక కళారూపాలు, సంక్లిష్ట సమస్యలకు వినూత్న పరిష్కారాలు జన్మిస్తాయి. కేవలం పాత పద్ధతులను అనుసరించడం అనేది ఒక నిర్దేశిత పాత దారిలో కళ్లు మూసుకుని నడవడం లాంటిదే. అక్కడ సృజనాత్మకతకు, కొత్తదనానికి ఎటువంటి తావు ఉండదు. ప్రపంచ ప్రగతిని, మానవ జీవన ప్రమాణాలను మార్చిన ప్రతి గొప్ప శాస్త్రీయ ఆవిష్కరణ వెనుక ఒక తిరుగుబాటు ఆలోచన దాగి ఉంటుంది. సమాజంలో చలామణి లో ఉన్న సంప్రదాయాలకు భిన్నంగా, సరికొత్త కోణంలో ఆలోచించే సాహసోపేతమైన ధైర్యమే దానికి మూలకారణం. గతానుగతికంగా ఎవరైనా అందరూ ఇలాగే చేస్తున్నారు కదా, మనం కూడా అలాగే చేద్దాం అని అనుకుని ఆగిపోతే, నేడు మానవాళి అనుభవిస్తున్న ఏ ఒక్క ఆవిష్కరణ సాకారమయ్యేది కాదు. విజ్ఞాన శాస్త్రం, కళా రంగం, సాహిత్యం, లేదా పారిశ్రామిక వ్యాపార రంగాలు కావచ్చు – ప్రతి రంగంలోనూ అద్భుతమైన ముందడుగు వేసిన ప్రవక్తలు, నాయకులు అందరూ అనుసరణను, మూస పద్ధతులను నిర్ద్వంద్వంగా తిరస్కరించి, తమ సొంత సృజనాత్మక మార్గాన్ని నిర్మించుకున్నవారే.విద్యా వ్యవస్థ, సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం దురదృష్టవశాత్తూ, నేటి మన ఆధునిక విద్యా వ్యవస్థ కూడా పరోక్షంగా ఈ అనుకరణ సంస్కృతినే తీవ్రంగా ప్రోత్సహిస్తోందనే గట్టి విమర్శలు ఉన్నాయి. విద్యార్థులను స్వతంత్రంగా, హేతుబద్ధంగా ఆలోచించమని ఉసిగొల్పడానికి బదులుగా, కేవలం పరీక్షల్లో మార్కుల కోసం జవాబులను బట్టీ పట్టి గుర్తుంచుకోమని ఒమ్మడిగా ప్రోత్సహించడం గమనార్హం. ప్రతి ఒక్కరూ ఒకే విధమైన పరుగు పందెంలో, ఒకే రకమైన సాఫ్ట్‌వేర్ లేదా వైద్య రంగ లక్ష్యాలను వెంబడించమని కుటుంబాల నుంచి ఒత్తిడి చేయడం వల్ల పిల్లల్లో సహజంగా ఉండే సృజనాత్మకత బాల్యంలోనే సమాధి అయిపోతోంది. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను పొరుగువారి పిల్లలతో నిరంతరం పోలుస్తూ, "వాడిలా ఎక్కువ మార్కులు తెచ్చుకో, వాడిలా క్రమశిక్షణగా ప్రవర్తించు" అని నిరంతరం ఒత్తిడి చేయడం ద్వారా అనుకరణకు బీజం వేస్తున్నారు. దీనివల్ల పసి హృదయాలు తమ స్వంత ఆసక్తులను, ప్రత్యేక ప్రతిభను గుర్తించే సువర్ణ అవకాశాన్ని కోల్పోతున్నాయి. మరోవైపు, నేటి డిజిటల్ యుగంలో సామాజిక మాధ్యమాలు ఈ అనుకరణ వ్యాధిని మరింత తీవ్రతరం చేశాయి. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి వేదికల్లో ఇతరుల కృత్రిమ జీవనశైలిని, ఆడంబరాలను చూసి, తాము కూడా అలాగే బతకాలని, ఇతరుల యాంత్రిక అభిప్రాయాలనే తమ స్వంత అభిప్రాయాలుగా ప్రచారం చేసుకోవాలని లక్షలాది మంది యువతీ యువకులు నిరంతరం పరితపిస్తున్నారు. దీనివల్ల సమాజంలో విభిన్న ఆలోచనల వైవిధ్యం పూర్తిగా అంతరించిపోయి, సమాజమంతా ఒకే మూసలో ఆలోచించే ఒక ప్రమాదకరమైన బానిసత్వ పరిస్థితి ఏర్పడుతోంది. ఇది దీర్ఘకాలంలో మానవ మేధో వికాసానికి పెద్ద ముప్పుగా పరిణమించనుంది. ఈ సంక్షోభ పరిస్థితి నుంచి బయటపడటానికి మార్గం ఒక్కటే అది స్వీయ అన్వేషణ, ఆత్మపరిశీలన. ప్రతి వ్యక్తి మొట్టమొదట తనలో ఉన్న ప్రత్యేక నైపుణ్యాన్ని, అంతర్గత శక్తులను గుర్తించి, వాటిని మనస్ఫూర్తిగా గౌరవించడం నేర్చుకోవాలి. సమాజంలో ఇతరుల విజయాల నుంచి, మహనీయుల జీవితాల నుంచి ఆదర్శవంతమైన స్ఫూర్తిని పొందడం ఎంతమాత్రం తప్పు కాదు. కానీ వారిని అక్షరాలా కాపీ కొట్టడం, వారిలా నటించడం మాత్రం ఖచ్చితంగా స్వీయ మేధో ఆత్మహత్యతో సమానమని గ్రహించాలి. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు పిల్లలను నిరంతరం ప్రశ్నించమని, సంప్రదాయాలకు భిన్నంగా సరికొత్తగా ఆలోచించమని ప్రోత్సహించాలి. సమాజం కూడా కేవలం ఒకే రకమైన మూస విజయాలను కాకుండా, భిన్నత్వాన్ని, సరికొత్త ప్రయోగాలను సాదరంగా స్వాగతించే విశాలమైన మనస్తత్వాన్ని అత్యవసరంగా పెంపొందించుకోవాలి. ముగింపుగా చెప్పాలంటే, అనుకరణ అనేది మనిషిని తాత్కాలికంగా సురక్షిత తీరాల్లో ఉంచవచ్చు, కానీ అతనిని ఎప్పటికీ చరిత్రలో ఒక గొప్ప వ్యక్తిగా నిలబెట్టలేదు. స్వతంత్ర ఆలోచనా విధానం కొన్నిసార్లు ప్రారంభంలో అత్యంత కష్టంగా అనిపించవచ్చు. కానీ అదే నిజమైన సృజనాత్మకతకు, మహోన్నత వ్యక్తిత్వ వికాసానికి రాజమార్గం అవుతుంది. ఆధునిక పౌరులుగా మనం ఇప్పుడు ఎలాంటి జీవితాన్ని ఎంచుకోవాలో స్పష్టంగా పునరాలోచించుకోవాలి కేవలం ఇతరుల వెనుక నడిచే ఒక అనామక నీడలా బతకాలా, లేక సమాజానికి దిశానిర్దేశం చేసే ఒక స్వయంప్రకాశిత వెలుగులా ప్రకాశించాలా అనేది పూర్తిగా మన విచక్షణపైనే ఆధారపడి ఉంది.

డా .సూర్యదేవర రామకృష్ణ ,Moral Philosopher, 9490754169



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# ఐదు దశాబ్దాల తర్వాత ప్రజారవాణాకు మరో మైలురాయి




పల్లెలైన, పట్టణాలైనా ప్రజారవాణా సౌకర్యం లేకపోతే అవి అభివృద్ధికి నోచుకోవు అనే విషయం జగమెరిగిన సత్యం. ఇట్లాంటి చారిత్రక సత్యాన్ని ఆచరణలో చూపెటందుకు నాగర్ కర్నూలు పట్టణం త్వరలో వేదిక కానుంది. ఐదు దశాబ్దాల తర్వాత ప్రజారవాణాను మెరుగు పరిచేందుకు, ప్రయాణీకులకు సౌకర్యాలు కల్పించేందుకు నాగర్ కర్నూలు నూతన బస్టాండ్‌కు శుంకుస్థపన చేయడమంటే ఇక్కడి ప్రజారవాణా వ్యవస్థలో మరో మైలురాయిగా చెప్పవచ్చు. హైదరాబాద్ రాష్ట్రంలో ఒకనాడు (నాగర కందనూలు) నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంగా ఉన్నప్పటికీ రైలు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఈజిల్లా కేంద్రాన్ని పాలమూరుకు 1904లో మార్చబడి ఆనాడు పాలిస్తున్న మీర్ మహబూబ్ అలీఖాన్ పేరిట మహబూబ్‌నగర్ జిల్లాగా మారింది. ఎన్నో పోరాటాలు, త్యాగాలతో 2014 జూన్ 2న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016 అక్టోబర్ 11 న తిరిగి 110 సంవత్సరాలకు నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంగా ఏర్పడింది.

## ఇక చరిత్రలోకి వెళితే..

ఒకవైపు నల్లమల అటవీ ప్రాంతం మరోవైపు కృష్ణా ,దుందుభి నదులు ప్రవహిస్తున్నా నిత్యం కరువు కాటకాలతో అన్నమో రామచంద్ర అంటూ పొట్ట చేత పట్టుకొని వలసలు వెళ్ళే ప్రాంతంగా పేరు మోసింది. వెనుక బాటుతనానికి గురైన నాగర్ కర్నూలు ప్రాంతంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దాదాపు నాలుగు దశాబ్దాలు ప్రభుత్వ ప్రజారవాణ వ్యవస్థకు నోచుకోలేదు. ఆనాడు ఈప్రాంతంలో ఒంటి చేతితో ప్రైవేటు ప్రజారవాణ వ్యవస్థను నడిపించిన గొప్ప వ్యక్తి కల్వకుర్తి అబ్దుల్ ఖాదర్.

ఆరోజుల్లో ఆయన సర్వీసులు లేకపోతే ఈప్రాంతంలో విద్యా, ఉద్యోగాలు పొందేవారు కాదు. ఎంతో మంది పేద ప్రజలకు ఈసర్వీసులే దిక్కు అయినాయి. అలాగే నాగమోళ్ళ సర్వీసు కూడ ఉండేది. ఇలా ఆనాడు ఇక్కడి ప్రజలు జీవనం కొనసాగించారు. నాగర్‌కర్నూల్ పట్టణం ఆనాడే మేజర్ గ్రామ పంచాయతీ, నియోజకవర్గ కేంద్రం అయినప్పటికీ సరైన వసతులు లేవు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానం(గ్రౌండ్) లో ఒకవైపు పశువుల సంత ,మరో వైపు బయట నుండి వచ్చే బస్సు, సర్వీసులకు అడ్డాగా వున్నది. పోస్టాఫీస్ సమీపంలో సర్వీసు స్టాండ్ వుండేది. నల్లవెల్లి రోడ్డులో ప్రస్తుతం వున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా వున్న దుకాణాల సముదాయంలో సర్వీసు గ్యారేజ్ వుండేది.

ఇలాంటి పరిస్థితుల్లో 1979 నవంబర్ 8న నాగర్‌కర్నూల్ బస్టాండ్ (స్టేషన్)కు నాటి ఎమ్మెల్యే యం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శంకుస్థాపన జరిగింది. ఆనాడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా మర్రిచెన్నారెడ్డి, ఎ.వెంగళ్ రెడ్డి రవాణాశాఖ మంత్రిగా ఉన్నారు. దాదాపు నాలుగు సంవత్సరాలు తర్వాత 1983 మే 20న ఆనాటి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే వంగ నారాయణ గౌడ్ (వివిఎన్ గౌడ్) ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రారంభించారు. ఆనాడు ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్, పి.మహేంద్రనాథ్ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రిగా, రవాణా శాఖ మంత్రిగా నల్లపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

ఆ తర్వాత 9 సంవత్సరాలకు 1992 ఫిబ్రవరి 23న నాటి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే వంగ మోహన్ గౌడ్ , ఎంపీ మల్లురవి ఆధ్వర్యంలో నాగర్ కర్నూలులో బస్ డిపో ప్రారంభించారు. ఆనాడు ముఖ్యమంత్రిగా నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా పి.సాంబశివ రాజు, బీసీ సంక్షేమ మంత్రిగా జె.చిత్తరంజన్ దాస్ వున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రపు రవాణా వ్యవస్థ ఇలా కొనసాగుతూ అభివృద్ధి చెందుతున్న తరుణంలో సరిగ్గా 47 సంవత్సరాల తర్వాత పెరిగిన జనాభాను దృష్టిలో వుంచుకుని పట్టణంలో రూ.20కోట్లతో మరో నూతన బస్ స్టాండ్ నిర్మాణానికి 2026 జూలై 8న శంకుస్థాపన జరగడం రవాణాకు మరోమైలు రాయి పడిందని చెప్పవచ్చు. నూతన బస్ స్టాండ్ నిర్మాణంతో ప్రయాణీకులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడంతో పాటు జిల్లా రవాణా వ్యవస్థ మెరుగు పడుతుంది. నాడు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలుగా వున్న సమయంలోనే రవాణా వ్యవస్థకు బీజం పడింది. సరిగ్గా నేడు కూడా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో పాలమూరు ముద్దు బిడ్డ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, ఎంపీ డా.మల్లురవి, ఎమ్మెల్సీ కే.దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూలు ఎమ్మెల్యే డా.కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో మరో నూతన బస్టాండ్ మంజూరు కావడంతో పాటు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా శుంకుస్థాపన జరగడం ఈప్రాంత అభివృద్ధికి మరో ముందడుగు పడిందని చెప్పవచ్చు.



ముచ్చర్ల దినకర్ రచయిత
9440704535

# యస్ఐఆర్ ఫారంలను బియల్ఓ లు ఇంటింటికి వెళ్లి ఇవ్వాలి:సిపిఎం

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 06:**



గాజులరామారం డివిజన్ పరిధిలో యస్ఐఆర్ ఫారాలను బియల్ఓ లు ఒక దగ్గరే కూర్చొని ఇసున్నారని దీనివల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సిపియం గాజుల రామారం డివిజన్ కార్యదర్శి జాకీర్ పేర్కొన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సిపియం నాయకులు ఈఆర్వో పింకేష్ కి వినతిపత్రం అందజేశారు. సిపియం సీనియర్ నాయకులు బురాన్ మాట్లాడుతూ యస్ఐఆర్ లో ఓటర్ల పేరు, పోన్ నంబర్లు తప్పులు ఉన్నాయని దానివల్ల ప్రజలు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందన్నారు. ముందుగా యస్ఐఆర్ లో ఉన్న తప్పులను సరిచేయాలని సూచించారు. అలాగే యస్ఐఆర్ పై ప్రజలకు అవగాహన కలిగించాలని కోరారు. ఈకార్యక్రమంలో ముఖ్తర్, ఆరిఫ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి లో అందిన వినతులను స్వీకరించిన డిప్యూటీ కమిషనర్ డి లావణ్య.

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 06:**



సోమవారం రోజున సిఎంసీ, కొంపల్లి సర్కిల్–56 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య ప్రజల నుండి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 1 వినతి పత్రం (అప్లికేషన్) స్వీకరించబడినది.పెన్షన్ రద్దు చేయవలసిందిగా వినతి.స్వీకరించిన వినతిని సంబంధిత శాఖ అధికారులకు పంపించి, త్వరితగతిన పరిష్కరించాలని డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య ఆదేశాలు జారీ చేశారు.అధికారులు ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకొని, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# ప్రతి పేదవారికి ఇండ్లు,స్థలాలు దక్కే వరకు పోరాటం ఆగదు:సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి జూలై 06:**




పేదవారికి ఇల్లు,స్థలాలు ఉన్న వారికి పట్టాల సాధన కొరకు నేడు ఇందిరపార్క్ లో రాష్ట్రంలోని అన్ని వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నుండి భారీ సంఖ్యలో సిపిఐ నాయకులు కార్యకర్తలు హాజరవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలకు ముందు స్థలాలు లేని వారికి స్థలాలు ఇస్తామని ఇల్లు లేని వారికి ఇల్లు కట్టిస్తామని హామీలు ఇచ్చి గెలిచాక ఆ హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నాయని అలాంటి మోసాలు ఇకముందు జరగకుండా మోసం చేసే ప్రభుత్వాలను మూడు కట్టడానికి ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా కొలుపులాపూర్ నియోజకవర్గంలో కూడా వేలాది మంది ప్రజలు సొంత ఇల్లు లేక నివసిస్తున్నారని అలాంటి వారందరినీ సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు నరసింహారెడ్డి, సిపిఐ నాయకులు కృష్ణ, వెంకటేష్, బక్కరి మల్లేష్, నాగేష్, ఇమామ్, నరసయ్య, ముసలయ్య, యాదగిరి,కొండయ్య యువజన నాయకులు కీర్తి, ప్రవీణ్, మహేష్, వంశీ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేబీ ఇంటీరియో (KB Interio) నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 06:**



బాచుపల్లి పరిధిలోని దేవేందర్ నగర్ కేబీ ఇంటీరియో కార్యాలయం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె. బాల బ్రహ్మచారి నూతనంగా ఏర్పాటు చేసిన కెబీ ఇంటీరియో (KB Interio) నూతన కార్యాలయాన్ని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంపీరియల్ రంగంలో నాణ్యమైన సేవలను అందిస్తూ కస్టమర్ల విశ్వాసాన్ని పొందాలని, సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం సంస్థ వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సంస్థ మేనేజర్ కె.రంజిత్ చారి, శ్రీనివాస్, గౌతమ్, ఉదయ్, మహాదేవపురం అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు షఫీ, గఫ్ఫార్, జగన్నాథ్, అజామ్, శ్రీనివాస్ రావు, రాజుచారి, ఆకోడే శ్రీనివాస్, జితేందర్ రెడ్డి, శ్రీలత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని పరామర్శించిన మాజీ మంత్రి హరిష్ రావ్ పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 06:**



(ఆదివారం) వరంగల్ కన్నెపల్లి రిజర్వాయర్ పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని శంభీపూర్ లోని నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి మాజీమంత్రి హరిష్ రావ్, పటాన్చెరువు నియోజకవర్గ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఈసందర్భంగా వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యమ కారులకు ప్రమాదం చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడం లేదని విమర్శించారు.

# ప్రజాసేవకు గుర్తింపుగా మందలపు సాయిబాబు చౌదరికి గౌరవ డాక్టరేట్

**కూకట్ పల్లి జూలై 6 వెలుతురు:**




ప్రజాసేవను జీవిత ధ్యేయంగా చేసుకుని మూడు దశాబ్దాలకు పైగా సమాజానికి విశిష్ట సేవలందిస్తున్న హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు, వ్యాపారవేత్త మందలపు సాయిబాబు చౌదరి కి ప్రతిష్ఠాత్మక గౌరవ డాక్టరేట్ లభించింది. పాండిచ్చేరిలోని కమ్మన్ కళాక్షేత్రంలో నిర్వహించిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్షిప్ అండ్ ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానోత్సవంలో ఈ గౌరవాన్ని ఆయనకు ప్రదానం చేశారు. గత 35 సంవత్సరాలుగా ప్రజా, రాజకీయ, సామాజిక రంగాల్లో నిరంతర సేవలందిస్తున్న సాయిబాబు చౌదరి కరోనా, స్వైన్ ఫ్లూ వంటి మహమ్మారుల సమయంలో బాధితులకు అండగా నిలిచారు. అలాగే హుద్‌హుద్, తిత్లీ తుఫాన్లు, వరదలు తదితర ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొని అనేక కుటుంబాలకు చేయూతనందించారు. రోడ్డు ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాల్లో బాధితులకు అత్యవసర సహాయం అందిస్తూ మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు. అదేవిధంగా మందలపు రోజారాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు విద్యా సహాయం, నిరుపేదలకు వైద్య సేవలు, ఉచిత ఆరోగ్య శిబిరాల నిర్వహణతో పాటు బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పలు సేవా కార్యక్రమాలు చేపట్టి విశేష గుర్తింపు పొందారు. వ్యాపార రంగంలోనూ నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ అందుబాటు ధరల్లో గృహాల నిర్మాణం చేపట్టి ప్రజల విశ్వాసాన్ని సంపాదించారు. ప్రజాసేవ, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, సేవా తపనను గుర్తించిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్షిప్ అండ్ ఎక్సలెన్సీ సంస్థ ఆయనను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, సమాజంలోని ప్రతి వర్గం ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ నిస్వార్థ సేవలను అందిస్తున్న మందలపు సాయిబాబు చౌదరి కి గౌరవ డాక్టరేట్ లభించడం ఆయన సేవలకు దక్కిన సముచిత గుర్తింపని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# డాక్టర్ ఉక్కుల అశోక్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ 49వ వర్ధంతి వేడుకలు

**ఇబ్రహీంపట్నం వెలుతురు జులై 06:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం.భారత ఉపప్రధాని స్వాతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్ రా మ్ 49వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రకాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడుమానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాలమేరకు.

భారత మాజీ ఉపప్రధాన మంత్రీ మహానే త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 49వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్రప్రధాన కార్యదర్శి డాక్టర్ ఉక్కుల అశోక్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో శ్రీ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించా రు కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు దళిత విభాగ నాయకులు కార్యకర్తలు అందరూ పెద్దసంఖ్యలో హాజరై.ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డు వద్ద మ రియు కొంగరకాలన్ డివిజన్ పరిధిలో ఉన్న చింతపల్లిగూడ ఎక్స్ రోడ్ వద్ద మహానేత బాబు జగ్జీ వన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు ఈకార్యక్రమంలో భూపరిరక్షణ కమి టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షుడు మచ్చ జంగయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నా యకుడు పంది రవికుమార్ కొంగరకాలన్ 54వ డివిజన్ అధ్యక్షుడు చేనేమోని రమేష్ ముదిరాజ్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పల్నాటి యాదగిరి మంగళపల్లి మామ్మాయమ్మ టెంపుల్ చైర్మన్ వ ట్నాల రాములు గౌడ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సీనియర్ నాయకులు అడల భిక్షపతి బీఎస్పీ ఇ బ్రహీంపట్నం మున్సిపాలిటీ అధ్యక్షుడు మంద రాజు డా మధుసూదన్ జోగు ముత్తయ్య ఎడ్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం: మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు

- **వివేకానంద నగర్‌లో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి...**

**కూకట్ పల్లి జూలై 6 వెలుతురు:**



శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్ రిక్షా పుల్లర్స్ కాలనీలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు స్థానిక నాయకులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాధవరం రంగారావు మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేత అని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాబు జగ్జీవన్ రామ్ ప్రజాసేవ, సామాజిక సమానత్వం, నిస్వార్థ నాయకత్వం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారానే సమాజంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు మరింత బలోపేతం అవుతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆంజనేయులు, బాబు, ప్రవీణ్, జగదీష్ గౌడ్, యశ్వంత్, రాంచందర్, రమేష్, మల్లేష్, వినయ్, వేముల రవి, యాకన్న, రాజు, పింటూ, సోమేష్, రామ్మూర్తి, వినోద్, మాధవి రెడ్డి, కరుణ, రాధిక, శ్రావణితో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర్ నగర్‌లో కలుషిత తాగునీటి సరఫరాపై మెట్రో వాటర్ అధికారులకు ఫిర్యాదు

- **సమస్య పరిష్కారం వరకు ఉచిత వాటర్ ట్యాంకర్లు పంపించాలని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు విజ్ఞప్తి...**

**కూకట్ పల్లి జూలై 6 వెలుతురు:**

కూకట్ పల్లి వెంకటేశ్వర్ నగర్ 35వ బ్లాక్‌లోని నవభారత్ వెల్ఫేర్ అసోసియేషన్ పరిధిలో గత నెల రోజులుగా గృహాలకు కలుషిత తాగునీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు స్థానిక నివాసితులతో కలిసి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సేవరేజ్ బోర్డు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మెట్రో వాటర్ డీజీఎం శ్రీనివాసరాజు, మేనేజర్ ప్రియాంకలను కలిసి సమస్యను వివరించిన రంగారావు, కలుషిత నీటి సరఫరా కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే సమస్యను గుర్తించి స్వచ్ఛమైన తాగునీటి సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైతే ఉచితంగా వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని మెట్రో వాటర్ అధికారులను రంగారావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహేందర్, భాస్కర్‌తో పాటు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.




# ఇబ్రహీంపట్నం నుండి దాద్ పల్లి గ్రామానికి అదనపు బస్సు సౌకర్యం కల్పించిన డిపోమేనేజర్ సుజాతకు ప్రత్యేక ధన్యవాదాలు

- **మంచాల మండలం మాజీ వైస్ ఎంపీపీ నర్సింగ్ వెంకటేష్ గౌడ్, సర్పంచ్ నేనావత్ శాంతి రాజు నాయక్, మాజీ ఎంపీటీసీ నర్సింగ్ అనిత వెంకటేష్ గౌడ్**

**మంచాల వెలుతురు జులై 06:**



మంచాల మండలం దాద్ పల్లి గ్రామసర్పంచ్ నేనావత్ శాంతి రాజు నాయక్ గ్రామపంచాయతీ పాలకమండలి గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు ఇబ్రహీంపట్నండిపో మేనేజర్ సుజాతగ్రామానికి వచ్చి న సందర్భంలో మధ్యాహ్నం12గంటల సమయంలో బస్సుసౌకర్యం లేనందున అదనపు ట్రిప్పు ఈ రోజు మధ్యాహ్నం దాద్ పల్లి గ్రామానికి ప్రారంభించడం జరిగింది గ్రామప్రజల తరఫున ఇబ్ర హీంపట్నం బస్సు డిపో మేనేజర్ సుజాత గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన మంచాల మం డలం మాజీ వైస్ ఎంపీపీ నర్సింగ్ వెంకటేష్ గౌడ్ గ్రామసర్పంచ్ నేనావత్ శాంతి రాజునాయక్ మాజీ ఎంపీటీసీ నర్సింగ్ అనిత వెంకటేష్ గౌడ్ ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ కావేటి నరసింగ్ రావు గ్రామ ప్రజలు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల లో జన సంఘ వ్యవస్థాపకులు ప్రసాద్ ముఖర్జీ 125 జయంతి వేడుకలు

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 06:**




ప్రముఖ జాతీయవాది, జనసంఘ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన భారత జాతీయ కాంగ్రెసు విధానాన్ని ముఖర్జీ వ్యతిరేకించాడు. ఒక రాష్ట్రానికి ప్రత్యేక జెండా, ప్రధానమంత్రి ఉండటాన్ని తీవ్రంగా నిరసించాడు. ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానమంత్రులు, రెండు జాతీయ పతాకాలు ఉండటాన్ని సహించలేమని నిరసిస్తూ పోరాటం చేసిన మహనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. రత్న మంజుల, అధ్యాపకులు డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, డాక్టర్ జె. చిన్నబాబు,డాక్టర్ ఎన్.లక్ష్మీ నీలిమ, డాక్టర్ జి.సునీత, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, ఎం. అనిత, డాక్టర్ డి.కిషన్, డాక్టర్ ఎం. రవీందర్ రావు, డాక్టర్ రాచమళ్ళ శ్రీనుతో పాటు నిర్వాహకులు బాబు, బాబూరావు మరియు విద్యార్థుల పాల్గొన్నారు.

# గురుకుల హాస్టల్ విద్యార్థినులకి భద్రత కల్పించాలి

- **ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి గోపగోని ఉదయ్ గౌడ్**

**మునుగోడు, జూలై 6 (వెలుతురు):**



మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల హాస్టల్ ఆవరణలో విపరీతంగా పెరిగిన గడ్డి కారణంగా విషపురుగులు సంచరిస్తూ విద్యార్థినుల ప్రాణాలకు ముప్పుగా మారాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి గోపగోని ఉదయ్ గౌడ్ ఆరోపించారు. సమస్యను పలుమార్లు హాస్టల్ ప్రిన్సిపల్, ఆర్‌సీఓ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు.దీనిపై జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. హాస్టల్‌లో భయాందోళనల మధ్య విద్యార్థినులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, విషపురుగుల నుండి ప్రాణాలు కాపాడుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.హాస్టల్ ఆవరణలోని గడ్డిని వెంటనే తొలగించి, విషపురుగుల నివారణ చర్యలు చేపట్టాలని, విద్యార్థినుల భద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్‌సీఓ, ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీకి బీజేపీ నేతల నివాళి



- **నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయంలో జయంతి వేడుకలు.**
- **దేశ సమైక్యతకు ముఖర్జీ సేవలను కొనియాడిన నేతలు.**
- **పెద్ద సంఖ్యలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు.**

**నల్లగొండ వెలుతురు జూలై 06:**

భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి పాల్గొని డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశభక్తి, త్యాగనిరతి, జాతీయ సమైక్యత కోసం చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

# కరీంనగర్‌లో హైకోర్టు ఆదేశాల బేఖాతరు సీజ్ చేసిన భవనంలో యథేచ్ఛగా కార్యకలాపాలు

**కరీంనగర్ వెలుతురు జూలై 06:**



కరీంనగర్ నగరంలో హైకోర్టు ఆదేశాలకు తూట్లు పడుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది. 2019 మున్సిపల్ చట్టాన్ని ఉల్లంఘించి నిర్మించిన ఒక బహుళ అంతస్తుల భవనం విషయంలో అధికారులు తీసుకున్న చర్యలను తప్పుపడుతూ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. సోమిడి వేణు ప్రసాద్ ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు...డబ్ల్యూ పి నంబర్ . 35394 ఆఫ్ 2025 (తేదీ: 20-11-2025) ప్రకారం, కళ్ళెపెల్లి బలరాజ్ అనే వ్యక్తి నిర్మించిన అక్రమ భవనంపై కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశిస్తే, హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులు సదరు భవనాన్ని సీజ్ చేశారని తెలిపారు. అయితే, సీజ్ చేసిన రెండు మూడు రోజుల్లోలోపే కళ్లపల్లి బాలరాజ్ ఆ సీల్ తొలగించి, భవనంలోకి ప్రవేశించి నివాసం ఉంటున్నారని పేర్కొన్నారు.కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అధికారులు సీజ్ చేసిన ఇంటిని అధికార పార్టీ అండదండలతో, ఓమంత్రి ప్రమేయంతో తొలగించి, అక్రమంగా నివాసముంటున్నారని, ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# 15 కోట్ల టెండర్ల నోటిఫికేషన్ను రద్దు చెయ్యాలి

- **మోత్కూర్ మున్సిపాలిటీ కౌన్సిల్**

**మోత్కూరు, జూలై 6,వెలుతురు న్యూస్ :**



మోత్కూరు మున్సిపాలిటీలో రూ.15 కోట్ల అభివృద్ధి పనుల టెండర్ల ప్రక్రియను కౌన్సిల్‌కు తెలియకుండా రహస్యంగా నిర్వహించారని, కౌన్సిలర్లను పూర్తిగా పక్కనబెట్టి కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరించారని మున్సిపాలిటీ కౌన్సిల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ టెండర్లను రద్దు చేయాలని కోరారు.సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు కమిషనర్, చైర్‌పర్సన్ వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు చేశారు. వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న మాట్లాడుతూ రూ.15 కోట్ల నిధులకు సంబంధించిన టెండర్లకు గత జూన్ 29న కౌన్సిలర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నోటిఫికేషన్ జారీ చేశారని అన్నారు. గతంలో కూడా ఇదే తరహాలో ఒకే టెండర్‌కు అవకాశం కల్పించగా, మెజారిటీ కౌన్సిలర్లు వ్యతిరేకించడంతో దానిని రద్దు చేయాల్సి వచ్చిందని గుర్తు చేశారు. అయినప్పటికీ మళ్లీ అదే విధానాన్ని కొనసాగించడం వెనుక భారీ కమిషన్ల కోణం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో అన్ని 12 వార్డుల్లో మోరీలు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని, అయితే ప్రస్తుతం ఆ నిధులను వార్డుల అవసరాలకు కాకుండా ఇతర ప్రాంతాలు, ప్రైవేట్ వెంచర్లలో రోడ్లు, ప్రహరీ గోడల నిర్మాణానికి మళ్లించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ప్రతి వార్డుకు సమానంగా నిధులు కేటాయించే వరకు ఈ టెండర్లను అంగీకరించబోమని స్పష్టం చేశారు. నెల రోజులుగా కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు సమయం లేని కమిషనర్‌కు రూ.15 కోట్ల టెండర్ల విషయంలో మాత్రం అంత తొందర ఎందుకని ప్రశ్నించారు. పాలకవర్గం ఏర్పడిన సమయంలో మున్సిపాలిటీ ఖాతాలో రూ.1.27 కోట్లు ఉండగా, ప్రస్తుతం ఎన్ని ఉన్నాయి?ఆ నిధులను ఎలా ఖర్చు చేశారో కౌన్సిలర్లకు పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ బ్యాంకు ఖాతాల వివరాలు కూడా తనకు ఇవ్వడం లేదని, నిధుల వినియోగంలో పారదర్శకత లేదని ఆరోపించారు. గత రెండు నెలల్లోనే రూ.45 నుంచి రూ.50 లక్షల వరకు కౌన్సిల్‌కు తెలియకుండా డ్రా చేశారని ఆరోపించారు. మున్సిపల్ పాలనలో ఎన్నికైన ప్రజాప్రతినిధుల కంటే ఇతరుల జోక్యం పెరిగిందని మహిళా ప్రతినిధుల స్థానంలో వారి భర్తలు పెత్తనం నడిపిస్తున్నారని విమర్శించారు. కమిషనర్ కూడా స్థానికంగా అందుబాటులో ఉండకుండా హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తూ కార్యాలయ నిర్వహణను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.ఈ సందర్భంగా 10వ వార్డు కౌన్సిలర్ నల్ల మధు మాట్లాడుతూ, టెండర్ల ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సింది పోయి, నిధులను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. మెజారిటీ కౌన్సిలర్ల అభిప్రాయాన్ని గౌరవించి ప్రతి వార్డుకు సమానంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సోలార్ ప్లాంట్ అనుమతులు, సిబ్బంది నియామకాలు, కోతుల నివారణ పనులు, పెండింగ్ బిల్లులు, మున్సిపల్ నిధుల వినియోగం తదితర అంశాల్లో కూడా అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా కొత్త నియామకాలు చేపట్టడం, చిన్నపాటి పనుల బిల్లులను నిలిపివేయడం, నిధుల వినియోగంలో స్పష్టత లేకపోవడం వంటి అంశాలపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని కోరారు. రూ.15 కోట్ల టెండర్ల నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేసి, కౌన్సిల్ నిర్ణయాల మేరకు పారదర్శకంగా కొత్త టెండర్ల ప్రక్రియ చేపట్టాలని, లేనిపక్షంలో కౌన్సిలర్లందరూ కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నల్ల మధు హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు కురిమిల్ల ప్రమీల, సుల్తాన్ స్వామి, బీసు శ్రీకాంత్, కారుపోతుల వెంకన్న, మెంట రమణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

- **తెలంగాణ క్రాంతి దళ్ రాష్ట్ర అధ్యక్షులు సంగం రెడ్డి పృథ్వీరాజ్.**

**మోత్కూరు, జూలై 06, వెలుతురు న్యూస్ :**



విద్యార్థులు సంఖ్య తక్కువ ఉందనే సాకుతో ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ క్రాంతి దళ్ రాష్ట్ర అధ్యక్షులు సంగం రెడ్డి పృథ్వీరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మోత్కూరులోని ఆర్యవైశ్య భవనంలో తెలంగాణ క్రాంతి దళ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మన ఊరు మనబడిని మనమే కాపాడుకుందాం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం మండల కోఆర్డినేటర్ కొంపల్లి వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పృథ్వీరాజ్ పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల ముందు మూత బడిన బదులను తెరిపిస్తామని అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లలోనే 23 వేల ప్రభుత్వ పాఠశాలలో మూసివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి కొనసాగుతున్న పాఠశాలలో ఏకో ఉపాధ్యాయుడుతో ప్రభుత్వం నెట్టుకొస్తుందని, కానీ ప్రతి తరగతి ఉపాధ్యాయుడు ఉండాలనే నిబంధనలను ఉండాలవి నిబంధనలను పూర్తిగా విస్మరించదన్నారు. రాష్ట్రంలో 633 మండలాలకు అన్ని మండలాల కేంద్రాలలో ఎంఈఓ ఉండవలసి ఉండగా కేవలం ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఎంఈఓ ఉన్నారని విద్య వ్యవస్థ ఎలా ఉందో దీన్ని బట్టి అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో 44 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలలో,సంక్షేమ పాఠశాలలో చదువు సాగిస్తున్నారని అందులో 1లక్ష 19 వేల మందికి మాత్రమే మధ్యాహ్న భోజనం పెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపతం చేయమంటే ముఖ్యమంత్రి విద్యాశాఖను తన వద్ద అంటిపెట్టుకొని ప్రైవేట్ యూనివర్సిటీలను,కార్పొరేట్ పాఠశాలలను, వైద్య రంగాన్ని ముఖ్యమంత్రి ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు.పల్లెలలో సరైన విద్యను నోచుకోలేక బార్లు,ఫంక్షన్ హాల్లలో కూలీ పనులు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రతి పేదవాడికి ఉన్నత విద్య నోచుకోవాలంటే పల్లెలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మూసి వేయకుండా ప్రతి ఒక్కరూ సైనికుల వలె సమిష్టిగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అక్కేనపల్లి వెంకటాచారి, డిటిఎఫ్ జిల్లా ప్రతినిధి బోళ్ల హనుమంత్, రిటైర్డ్ ఉపాధ్యాయులు అవిశెట్టి అవిలిమల్లు, బిసి రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమేల నర్సయ్య, మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవ్, వి.ఆర్.పి. జిల్లా అధ్యక్షులు ఎడ్ల నరేష్ పట్టణ బిజెపి మాజీ అధ్యక్షులు పోచం సోమయ్య, డిఫెన్స్ వినియోదారుల సంఘం అధ్యక్షులు గుమ్మిడెల్లి పరశురాములు, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జిట్ట గౌతమ్, ప్రైవేట్ డిగ్రీ కళాశాల అసోసియేషన్ ఉమ్మడి నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు చౌగొని సత్యం, తెలంగాణ క్రాంతి దళ్ జిల్లా ఇంచార్జ్ రాము, మండల ప్రధాన కార్యదర్శి కూరెళ్ళ ఉదయ్, సహాయ కార్యదర్శులు మెంట స్వామి, బందెల శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంతరిక్షంలోకి భారత శాస్త్రవేత్తల చిత్రాలు.. 'విక్రమ్1' ప్రయోగానికి సిద్ధం

- **సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, అబ్దుల్ కలాం సూక్ష్మ చిత్రాలు అంతరిక్షంలోకి**
- **18 క్యారెట్ల బంగారంతో మైక్రో రాకెట్ రూపొందించిన కళాకారుడు అజయ్ కుమార్**
- **బియ్యం గింజ కంటే చిన్న పరిమాణంలో శాస్త్రవేత్తల చిత్రాలు**
- **కాస్మోస్ డైమండ్స్ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్ కూడా పేలోడ్‌లో చోటు**
- **2022లో విక్రమ్-ఎస్‌తో చరిత్ర సృష్టించిన స్కైరూట్**
- **ఇప్పుడు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగానికి సిద్ధమైన సంస్థ**
- **శ్రీహరికోటలోని షార్ ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగం**
- **భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి కొత్త అధ్యాయంగా 'మిషన్ ఆగమన్'**

**శ్రీహరికోట వెలుతురు జూలై 06:**

దేశంలోనే తొలిసారిగా ప్రైవేట్‌గా అభివృద్ధి చేసిన ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1 తొలి ప్రయోగానికి రంగం సిద్ధమైంది. 'మిషన్ ఆగమన్' పేరుతో ఈ ప్రయోగాన్ని జులై 12 నుంచి ఆగస్టు 4 మధ్య నిర్వహించనున్నట్లు స్కైరూట్ ఏరోస్పేస్ ప్రకటించింది.

ఈ మిషన్‌లో భారత అంతరిక్ష, శాస్త్ర రంగాలకు విశేష సేవలందించిన ముగ్గురు దిగ్గజ శాస్త్రవేత్తల సూక్ష్మ చిత్రాలను అంతరిక్షంలోకి పంపనున్నట్లు వెల్లడించింది.నోబెల్ గ్రహీత సర్ సీవీ రామన్, భారత అంతరిక్ష కార్యక్రమ పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్, మాజీ రాష్ట్రపతి, ప్రముఖ ఏరోస్పేస్ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సూక్ష్మరూపాలను ఈ ప్రయోగంలో భాగంగా తీసుకెళ్లనున్నారు. వీటిని మైక్రో ఆర్టిస్ట్ అజయ్ కుమార్ 18 క్యారెట్ల బంగారంతో రూపొందించిన చిన్న రాకెట్‌పై చెక్కారు. ఒక్కో చిత్రం బియ్యం గింజ కంటే చిన్న పరిమాణంలో ఉండటం విశేషం.ఈ మిషన్‌లో కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్ కూడా పేలోడ్‌గా అంతరిక్షంలోకి వెళ్లనుంది. భారత శాస్త్రవేత్తలకు నివాళిగా ఈ ప్రత్యేక పేలోడ్‌ను రూపొందించినట్లు స్కైరూట్ తెలిపింది.2022లో విక్రమ్-ఎస్ ద్వారా భారత తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన స్కైరూట్ ఏరోస్పేస్.. ఇప్పుడు విక్రమ్-1తో దేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగాన్ని చేపట్టనుంది.

ఈ ప్రయోగం విజయవంతమైతే భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి కొత్త ఊపు లభించడంతో పాటు ప్రపంచ వాణిజ్య ఉపగ్రహ ప్రయోగాల మార్కెట్‌లో దేశ ప్రతిష్ఠ మరింత పెరగనుంది.తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి ఈ ప్రయోగాన్ని నిర్వహించనున్నారు. భారత అంతరిక్ష కార్యక్రమ పితామహుడు విక్రమ్ సారాభాయ్ గౌరవార్థం ఈ రాకెట్‌కు 'విక్రమ్' అని పేరు పెట్టగా, భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటల్ ప్రయోగాల యుగంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆగమన్' అనే పేరు ఖరారు చేశారు.

# భారతీయ జనతా పార్టీ కంగ్టి మండల్ ఇన్చార్జిగా పట్నం మాణిక్

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 06 :**



రంగారెడ్డి జిల్లా :- భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ అసెంబ్లీ కంగ్టి మండల్ ఇన్చార్జిగా నియమించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు.నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి గారికి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నారాయణఖేడ్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ జెనవాడే సంగప్ప గారికి, నారాయణఖేడ్ మాజీ శాసన సభ్యులు శ్రీ విజయ్ పాల్ రెడ్డి గారికి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ రవికుమార్ గౌడ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కంగ్టి మండలంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని మాట ఇస్తున్నాను. నారాయణఖేడ్‌లో కాషాయ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగుతాను.

మీ అందరి ఆశీస్సులు, సహకారం కోరుకుంటున్నాను.

భారత్ మాతా కీ జై!
జై బీజేపీ
ఇట్లు,
పట్నం మాణిక్
బీజేపీ కంగ్టి మండల్ ఇన్చార్జ్

# హైదరాబాద్–ముంబై బుల్లెట్ ట్రైన్ జహీరాబాద్ మీదుగానే వెళ్లేలా చర్యలు తీసుకోవాలి

- **కర్ణాటక బీదర్ సౌత్ ఎమ్మెల్యే శైలేంద్ర బెల్దలేకు ఎమ్మెల్యే మాణిక్‌రావు వినతి**

**జహీరాబాద్ వెలుతురు జూలై 06:**



హైదరాబాద్–ముంబై ప్రతిపాదిత హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌లో జహీరాబాద్ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని, ప్రస్తుత అలైన్‌మెంట్‌ను పునఃసమీక్షించి డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను తిరిగి జహీరాబాద్ మీదుగా రూపొందించేలా కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖపై ఒత్తిడి తీసుకురావాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు కోరారు.ఈ మేరకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆధ్వర్యంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, బీజేపీ నాయకులు భాస్కర్‌తో పాటు ఇతర స్థానిక నాయకులు కర్ణాటక రాష్ట్ర బీదర్ సౌత్ ఎమ్మెల్యే శైలేంద్ర బెల్దలేను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, హైదరాబాద్–ముంబై బుల్లెట్ ట్రైన్ జహీరాబాద్ మీదుగా వెళితే తెలంగాణ–కర్ణాటక సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి దోహదపడటమే కాకుండా పారిశ్రామిక, వాణిజ్య, విద్యా, ఉపాధి రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని వివరించారు. ఇప్పటికే జాతీయ రహదారులు, రైల్వే మార్గాలతో అభివృద్ధి చెందుతున్న జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ అనుసంధానం కల్పిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు.వినతిని స్వీకరించిన బీదర్ సౌత్ ఎమ్మెల్యే శైలేంద్ర బెల్దలే సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని కేంద్ర రైల్వే మంత్రి, నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, జహీరాబాద్ ప్రాంత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అలైన్‌మెంట్ పునఃసమీక్ష జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# గౌడిగార్‌పల్లిలో PRA నిర్వహించిన మల్లారెడ్డి వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు

- **రైతులతో నేరుగా సంభాషించి గ్రామీణ జీవనోపాధులపై అధ్యయనం చేసిన విద్యార్థులు...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 06:**



సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం గౌడిగార్‌పల్లి గ్రామంలో RAWEP కార్యక్రమం పరిధిలో మల్లారెడ్డి యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ విద్యార్థులు, కేవీకే (KVK) జహీరాబాద్ మార్గదర్శకత్వంలో పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ (PRA) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామస్థులతో నేరుగా మమేకమై వారి వ్యవసాయ పద్ధతులు, పంటల సాగు విధానాలు, స్థానిక వనరుల వినియోగం, వ్యవసాయం మరియు గ్రామీణ జీవనోపాధుల్లో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ ప్రజల చురుకైన భాగస్వామ్యంతో PRA కార్యక్రమం ప్రాయోగికంగా, ప్రయోజనకరంగా సాగింది.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు గ్రామీణ పరిస్థితులపై ప్రత్యక్ష అవగాహన పొందడంతో పాటు, ప్రజలతో సంభాషించే నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నారు. గ్రామీణాభివృద్ధిలో స్థానిక ప్రజల భాగస్వామ్యం ఎంత కీలకమో ఈ కార్యక్రమం ద్వారా అవగతమైందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు విఘ్నేశ్, మధు, చందు, రాజ్‌కుమార్, మనీష్, ఉదయ్, శేషి, రవీందర్, ఆదిత్య పాల్గొన్నారు.

# డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూలై 06:**



భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, ప్రముఖ విద్యావేత్త, దేశ సమైక్యతకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా కరీంనగర్ నగరంలోని తీగలగుట్టపల్లిలో ఉన్న మేయర్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం చేసిన త్యాగాలు, సేవలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.కాశ్మీర్ సంపూర్ణ విలీనానికి, దేశ సమగ్రతకు ఆయన చేసిన పోరాటం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశం ఒక్కటే, రాజ్యాంగం ఒక్కటే, జెండా ఒక్కటే అనే భావజాలాన్ని బలంగా చాటిచెప్పిన మహనీయుడిగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీని దేశ ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని తెలిపారు.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా దేశ సమైక్యతను మరింత బలోపేతం చేస్తూ అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని మేయర్ పేర్కొన్నారు. యువత మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం నాయకులు, కార్యకర్తలు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలు, దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నార్త్ జోన్ అధ్యక్షులు పాదం శివరాజ్, గాండ్ల నరేష్ , శివ , రాహుల్, కిరణ్ , పార్టీ నాయకులు, బీజేపీ శ్రేణులు తదితరులు పాల్గొని డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘనంగా నివాళులర్పించారు.

# బర్దిపూర్ చేరుకున్న ఆదిశంకరాచార్య వైభవం రథయాత్ర.. ఘన స్వాగతం

- **ధర్మరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత....**
- **మహామండలేశ్వర్ సిద్ధేశ్వరానందగిరి స్వామి....**
- **వేదమంత్రోచ్చారణల మధ్య ఆదిశంకరాచార్యుల పల్లకి ఊరేగింపు...**
- **దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక చైతన్యానికి శ్రీ వేదభారతి ఆధ్వర్యంలో ప్రచారం...**

**జహీరాబాద్ వెలుతురు జులై 06:**





ధర్మరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, జగద్గురు ఆదిశంకరాచార్యులు ధర్మకాండ, కర్మకాండలను సమన్వయం చేసి భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలకు శాశ్వత పునాదులు వేశారని తెలుగు రాష్ట్రాల మహామండలేశ్వర్, సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి స్వామి, ఆధ్యాత్మికవేత్త రాచయ్య స్వామి పేర్కొన్నారు.శ్రీ వేదభారతి, దత్తగిరి ఆశ్రమం, భారతీయం, సప్తవర్ణ ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఆది శంకరాచార్య వైభవం" రథయాత్ర ఆదివారం రాత్రి బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమానికి చేరుకుంది. సోమవారం ఉదయం గ్రామస్తులు, భక్తులు, ఆశ్రమ ప్రతినిధులు రథయాత్రకు పూర్ణకుంభ స్వాగతం పలికి ఘనంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆదిశంకరాచార్యుల విగ్రహాన్ని సుందరంగా అలంకరించిన పల్లకిలో గ్రామ వీధుల గుండా శోభాయాత్రగా తీసుకెళ్లారు. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భజనల నడుమ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు.స్వామిజీలు మాట్లాడుతూ.. ఆదిశంకరాచార్యుల తత్వబోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని, యువత భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ విలువలను తెలుసుకుని వాటిని ఆచరించాలని సూచించారు. ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక చైతన్యం, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక చైతన్యాన్ని విస్తరించాలనే సంకల్పంతో ఈ రథయాత్రను ఈ ఏడాది ఏప్రిల్ 21న హైదరాబాద్ తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం నుంచి రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, పీఠాధిపతుల సమక్షంలో ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో ఈ రథయాత్ర కొనసాగుతూ భక్తుల్లో విశేష ఆదరణ పొందుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆనందగిరి మాత, నందినిగిరి మాత, గూటూరు రమేష్ పాటిల్, గొల్ల నరసింహులు, బోయిని ఎల్లన్న, కోట వెంకటేశం, గణేష్ స్వామి, శ్రీపాద్ వైదిక పాఠశాల విద్యార్థులు, ఆశ్రమ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలపై సంగారెడ్డి కలెక్టరేట్ ముట్టడి.. ఉద్రిక్తత

- **ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు ఎస్ఎఫ్ఐ ధర్నా**
- **కలెక్టరేట్ ప్రధాన గేట్ వద్ద విద్యార్థుల ఆందోళన**
- **కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు**
- **గేట్లు తోసుకుని లోపలికి దూసుకెళ్లిన ఎస్ఎఫ్ఐ నేతలు**
- **పోలీసులకు, విద్యార్థి నాయకులకు మధ్య తోపులాట**
- **ఒక్కసారిగా విద్యార్థులు దూసుకురావడంతో మెయిన్ డోర్ మూసివేత**
- **కలెక్టరేట్‌లో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు**
- **ఏవో విజయలక్ష్మితో విద్యార్థి నాయకుల చర్చలు**
- **సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ**
- **అధికారుల హామీతో ఆందోళన విరమించిన ఎస్ఎఫ్ఐ**

**సంగారెడ్డి వెలుతురు జూలై 06:**



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు. కలెక్టరేట్ ప్రధాన గేట్ ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో గేట్లు తోసుకుంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించగా, పోలీసులకు, విద్యార్థి సంఘం నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు ముందుకు దూసుకురావడంతో పోలీసులు కలెక్టరేట్ ప్రధాన ద్వారాన్ని మూసివేశారు.అనంతరం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) విజయలక్ష్మి విద్యార్థి నాయకులతో చర్చలు జరిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అధికారుల హామీతో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు తమ ఆందోళనను విరమించారు.

# ఆపన్నులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

**డా. సిద్ధం ఉజ్వల్‌రెడ్డి చేతుల మీదుగా 11 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 06:**



ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ఆర్థిక భరోసాగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా. సిద్ధం ఉజ్వల్‌రెడ్డి అన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలోని ఆయన నివాసంలో జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు మాజీ టీజీఐడీసీ చైర్మన్ తన్వీర్‌తో కలిసి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డా. సిద్ధం ఉజ్వల్‌రెడ్డి మాట్లాడుతూ, అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఊరటనిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పేదల ఆరోగ్య సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేసి అనేక వ్యాధులకు ఉచిత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు.ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలవడం సీఎం రిలీఫ్ ఫండ్ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఈ సహాయ నిధి చెక్కుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డి, డా. సిద్ధం ఉజ్వల్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ యునూస్, సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి, జాఫర్, జావిద్, జహంగీర్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, రాంచందర్, అశ్విన్ పాటిల్, సునీల్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# డా. బాబు జగ్జీవన్ రాం ఆశయాలు చిరస్మరణీయం

- **జహీరాబాద్‌లో ఘనంగా 40వ వర్ధంతి వేడుకలు....**

**జహీరాబాద్ వెలుతురు జూలై 06:**

స్వాతంత్ర్య సమరయోధుడు, దళిత ఉద్యమ నేత, రిజర్వేషన్ల పరిరక్షకుడు, మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రాం 40వ వర్ధంతి వేడుకలను జహీరాబాద్ నియోజకవర్గంలోని పస్తాపూర్ బాబూజీ కూడలి వద్ద ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్ రామ్ సమతా వేదిక అధ్యక్షుడు జె. జైరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని బాబూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆధునిక భారతదేశ సమగ్రాభివృద్ధికి డా. బాబు జగ్జీవన్ రాం విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. దళితులు, వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. రిజర్వేషన్ల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి దేశానికి ఆదర్శమని తెలిపారు."మీ మేలును మేము మరువలేము... మీరు ఎల్లప్పుడూ మా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. అందుకే మీరు జగతికే జగ్జీవంగా నిలిచారు" అంటూ నాయకులు ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మాజీ మంత్రి మరియు జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఏ. చంద్రశేఖర్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వైనరోత్తం, మాజీ ఇండస్ట్రియల్ చైర్మన్ తన్వీర్, మున్సిపల్ చైర్మన్ యూనూస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉజ్వల్ రెడ్డి, నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ, ఉల్లాస్ మాదిగ, జైరాజ్, నిర్మల్, మైకల్, టీంకు, రాహుల్, జనార్దన్, దింపుల్, చిన్న, ఉగెల్లి రాములు, కండెం నరసింహులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.









# కుట్రలపై శంఖారావం

**నేడు విశ్వకర్మల రెండో రౌండ్ టేబుల్ సమావేశం**

**హైదరాబాద్, వెలుతురు జూలై 6:**

తమ కులంపై జరుగుతున్న కుట్రలను భగ్నం చేసేందుకు విశ్వబ్రాహ్మణులు మేల్కొంటున్నారు. కులగణనలో అయిదు వృత్తుల వారిని వేర్వేరు కులాలుగా చిత్రీకరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆధిపత్య కులాల కుట్రా లేక పాలకుల కుతంత్రమా అంటూ నిలదీస్తున్నారు. దీనిపై పోరాటానికి సై అంటున్నారు. అయిదు వృత్తులను ఒక్క కులంగా లెక్కబెడతే... ఎక్కడ 20 లక్షల మంది జనాభా ఉంటారో... ఆ కులం ప్రాధాన్యత ఎక్కడ పెరిగిపోతుందోనన్న పాలకుల దురాలోచన విశ్వకర్మీయులకు అర్థమైంది. అందుకే ఆలోచనాపరులు, మేధావి వర్గాలు ప్రభుత్వం వైఖరిని ప్రశ్నిస్తూ... నిరసిస్తూ... నిలదీస్తూ రౌండ్ టేబుల్ సమావేశాలకు శ్రీకారం చుట్టాయి. ఇందులో భాగంగా రెండో రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు జరగనుంది. హైదరాబాద్ నగరం నుంచే కాకుండా... జిల్లాల నుంచీ పంచదాయిలు ఈ ప్రత్యేక సమావేశానికి తరలి రానున్నారు. తమ వృత్తులను ఒకే కులంగా గుర్తించాలని, 5 వృత్తులను ప్రోత్సహించాలని, వెనకబాటు తనం పోవడానికి ఆర్థికంగా అండగా నిలవాలని, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, మ్యూజియం ఏర్పాటు తదితర తీర్మానాలను ఈ సమావేశంలో మరోసారి చర్చించి ఆమోదించుకుంటామని... వాటిని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని విశ్వకర్మ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రవీంద్రా చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో విశ్వకర్మ జేఏసీ ఏర్పాటుపైనా నిర్ణయం తీసుకుంటామన్నారు. మున్ముందు తమ పోరాటాలన్నీ జేఏసీ తరఫున జరుగుతాయని ఆయన సూచనప్రాయంగా చెప్పారు.

# కొండాపూర్‌లో రూ. 5.38 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- **అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం – ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ**
- **ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నాం – మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్**

**కొండాపూర్, వెలుతురు జూలై 6:**



కొండాపూర్ డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. డివిజన్ పరిధిలో రూ.5.38 కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ శంకుస్థాపన చేశారు.ప్రేమ్ నగర్ బీ బ్లాక్‌లో హిందూ స్మశానవాటిక అభివృద్ధి పనులకు రూ.2 కోట్ల అంచనా వ్యయం, ఓయూ ప్రొఫెసర్ కాలనీలో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2.98 కోట్ల అంచనా వ్యయం, శ్రీరామ్ నగర్ ఏ బ్లాక్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కాలనీ వాసులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అరేకపూడి గాంధీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొండాపూర్ డివిజన్‌ను ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతి అభివృద్ధి పనికి నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి దశల వారీగా అన్ని కాలనీల్లో రహదారులు, డ్రైనేజీలు, స్మశానవాటికలు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. నాణ్యతతో కూడిన పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.షేక్ హమీద్ పటేల్ మాట్లాడుతూ కొండాపూర్ డివిజన్ అభివృద్ధే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ సహకారంతో భారీ నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి కాలనీలో అవసరమైన మౌలిక వసతులు కల్పించే వరకు తమ ప్రయత్నం కొనసాగుతుందని పేర్కొన్నారు.అభివృద్ధి పనులు ప్రారంభం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# మరో 7 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ప్రత్యామ్నాయ పర్సన్ఇన్‌చార్జ్ కమిటీల నియామకం

**హైదరాబాద్, వెలుతురు జూలై 6:**



రాష్ట్రంలోని 20 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (PACS) ప్రత్యామ్నాయ నాన్-అఫీషియల్ పర్సన్-ఇన్-చార్జ్ (PIC) కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ రోజు మరో 7 PACS లకు ప్రత్యామ్నాయ పర్సన్-ఇన్-చార్జ్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణ సహకార సంఘాల చట్టం ప్రకారం ఈ కమిటీ ఆరు నెలలపాటు లేదా ఆయా సంఘాలకు ఎన్నికలు నిర్వహించే వరకు లేదా ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు, ఏది ముందైతే అది వర్తించే విధంగా నియమించడం జరిగిందన్నారు.ఈ రోజు కరీంనగర్ జిల్లాలోని దేవంపల్లి, గట్టుదుద్దెనపల్లి యాదాద్రి జిల్లా భువనగిరి, చందుపట్ల బీబీనగర్, వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి, వికారాబాద్ జిల్లాలోని పూడూరు PACSలకు ప్రత్యామ్నాయ నాన్-అఫీషియల్ పర్సన్-ఇన్-చార్జ్ కమిటీలను నియమిస్తూ, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీలు వెంటనే బాధ్యతలు స్వీకరించి ఆయా సహకార సంఘాల నిర్వహణను పర్యవేక్షించనున్నాయని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఉత్తర్వుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని సహకార సంఘాల ప్రత్యేక కమిషనర్ & రిజిస్ట్రార్‌ను మంత్రి ఆదేశించారు.

# ఓయూలో జూలై 10న మెగా జాబ్ మేళా–2026

- **100కుపైగా కంపెనీలతో భారీ ఉద్యోగ మేళా.**
- **10వ తరగతి నుంచి పీజీ వరకు అర్హులకు అవకాశం.**
- **జూలై 10న ఓయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహణ.**
- **రెజ్యూమ్, ఆధార్, విద్యార్హత పత్రాలతో హాజరు కావాలి.**

**హైదరాబాద్ వెలుతురు జూలై 06:**

తెలంగాణ ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీటీపీఓఏ), జీవీకే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జూలై 10న ఉస్మానియా యూనివర్సిటీ ఓయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో "మెగా జాబ్ మేళా–2026" నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెగా జాబ్ మేళా గోడపత్రికను టీటీపీఓఏ అధ్యక్షుడు డా. జయరాం, డా. ఎంజీ రామచంద్రన్, జీవీకే ప్రతినిధి అజయ్ కుమార్, ఎం. రాజులతో కలిసి ఆవిష్కరించారు.ఈ జాబ్ మేళాలో ప్రముఖ బహుళజాతి సంస్థలతో పాటు 100కు పైగా కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, పీజీ, ఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.అభ్యర్థులు రెజ్యూమ్ లేదా బయోడేటా, ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన



మొబైల్ నంబర్, పాన్ కార్డు కాపీ, అన్ని విద్యార్హతల జిరాక్స్ ప్రతులు వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 93919 27259, 8466670308, 94417 92625 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

- **మోదీన్‌పురం గ్రామ సర్పంచ్ సగరపు సునీత ప్రసాద్ పిలుపు**
- **మోదీన్‌పురం గ్రామ పంచాయతీలో హరితహారం కార్యక్రమం**
- **హరిత హారం కార్యక్రమంలో విస్తృతంగా మొక్కలు నాటిన సర్పంచ్**

**సూర్యాపేట, వెలుతురు జూలై 06 :**





మోదీన్‌పురం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో హరిత హారం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ సగరపు సునీత ప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సగరపు ప్రసాద్ మాట్లాడుతూ, చెట్లు మన జీవితానికి ఎంతో అవసరమని, వాతావరణ సమతుల్యతను కాపాడడంలో వాటి పాత్ర కీలకమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న హరిత హారం కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజలందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, మహిళా సంఘాల సభ్యులు, పంచాయతీ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలోని పాఠశాలలు, ప్రధాన రహదారుల వెంట, ఖాళీ ప్రదేశాల్లో వివిధ రకాల నీడనిచ్చే, ఫలవృక్షాలను నాటారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. హరిత హారం కార్యక్రమం ద్వారా గ్రామాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దడమే కాకుండా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమం విజయవంతంగా కొనసాగడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనర్దన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు దారావత్ ఛత్రు నాయక్, కన్నం జానయ్య, చీమ వీరయ్య ,మస్తాన్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహా, నవీన్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు .

# జర్నలిస్టు కుటుంబ సభ్యుల పిల్లలకు ఫీజు రాయితీ సర్క్యులర్ ను తక్షణమే జారీ చేయాలి

- **టీయూడబ్ల్యూజే (ఐజేయు) నియోజవర్గ ప్రధాన కార్యదర్శి ముడుపు శ్యాంసుందర్ రెడ్డి**

**మునుగోడు వెలుతురు జూలై 06:**




జర్నలిస్టు కుటుంబ సభ్యుల పిల్లలకు ఫీజు రాయితీ సర్క్యులర్ ను తక్షణమే జారీ చేయాలనీ టీయూడబ్ల్యూజే (ఐజేయు) నియోజవర్గ ప్రధాన కార్యదర్శి ముడుపు శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.టీయూడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా కమిటీ ఆదేశానుసారం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టు కుటుంబ సభ్యుల పిల్లలకు ఫీజు రాయితీ సర్క్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మునుగోడు మండల కేంద్రంలోనీ విద్య శాఖ కార్యాలయం వద్ద జర్నలిస్టులు నల్ల రిబ్బన్ లతో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన టీయూడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు కుంభం ఇంద్రసేనారెడ్డితో కలిసి మండల విద్యాధికారి తలమల్ల మల్లేశంకు వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ టీయూడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా కమిటీ గత నెల 5న నల్లగొండ డిఇఓ, కలెక్టర్ కి జర్నలిస్టు కుటుంబ సభ్యుల పిల్లలకు పాఠశాల విద్యలో ఫీజు రాయితీ కోసం వినతి పత్రాలు సమర్పించడం జరిగిందన్నారు.స్కూల్ ప్రారంభం అయి నెల రోజులు కావస్తున్నప్పటికిని విద్యాశాఖ సర్క్యులర్ జారీ చేయకుండా నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు.ఇతర జిల్లాలలో ఇప్పటికే ఫీజు రాయితీ సర్క్యులర్ జారీ చేసినందున తక్షణమే నల్గొండ జిల్లాలో కూడా సర్క్యులర్ జారీ చేసి పేద కుటుంబాల జర్నలిస్టుల పిల్లలు విద్యకు దూరం కాకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయు) నియోజవర్గ ఉపాధ్యక్షుడు జాజుల స్వామి,సహాయ కార్యదర్శి దొమ్మాటి కృష్ణ,జర్నలిస్టులు మార్నేని ప్రభాకర్,నెల్లికంటి శంకర్,బేరీ లింగస్వామి,పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్,దుబ్బ విజయ భాస్కర్,జీడిమడ్ల నరేష్,దుబ్బ అనిల్ , విజయ్ కుమార్ లు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణికి 112 ఫిర్యాదులు

- **ప్రజల ఫిర్యాదుల సమస్యలు అధికారులు వెంటనే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి**

**ఇబ్రహీంపట్నం వెలుతురు జులై 06:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో సోమవారం సమీ కృత జిల్లాకార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కా ర్యక్రమానికి మొత్తం112 ఫిర్యాదులు అందాయి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యా దుదారులు తమసమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు స మర్పించారుఈసందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరి ష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు అ ర్జీ లను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారుప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 36,ఇతర శాఖలకు 76 మొత్తం112 దరఖాస్తులు అందాయి ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద వివిధ శాఖల జిల్లా అధి కారులు కలెక్టరేట్



సూపరింటెండెంట్లుసంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దాసరి వారి దర్బార్ ఘన ప్రారంభోత్సవం

- **ముఖ్యఅతిథిగా రాధా ధీరజ్ రెడ్డి మాజీ కార్పొరేటర్ హాజరైనారు**

**ఎల్బీనగర్ వెలుతురు జులై 6:**



కొత్తపేట బాబు జగజ్జివన్ రామ్ భవనం సమీపంలో దాసరి వారి దర్బార్ వెజ్ అండ్ నాన్ వెజ్ ఫ్యామిలీ రెస్టారెంట్ ఘన ప్రారంభోత్సవం. ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి హాజరై తన చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు వారు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ యువత స్వయంగా వ్యాపార రంగంలో అభివృద్ధి చెందాలని సూచించిన క్రమంలోనే ఈ యొక్క రెస్టారెంట్ ను ప్రారంభించారు , సొంతంగా ఉపాధి పొందుతూ కొంతమందికి ఉపాధి అవకాశాన్ని కల్పిస్తున్నారు ఇక్కడ పరిశుద్ధమైన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ రెస్టారెంట్ ను ప్రారంభించారు వారు అభివృద్ధి చెందాలని తెలియజేశారు. నిర్వాహకులు, ప్రశాంత్, ధీరజ్, మనీషా నాయుడు,మాట్లాడుతూ, మా యొక్క ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన అతిథులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం మా యొక్క రెస్టారెంట్ రుచులను ఆస్వాదించాలని విజ్ఞప్తి చేస్తున్నాము ఈ కార్యక్రమంలో ముంతా రాములు యాదవ్,ఆర్కే పురం డివిజన్, డివిజన్ బిజెపి అధ్యక్షులు, కే వెంకటేష్ యాదవ్, బంధుమిత్రులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడే రంగారెడ్డి జిల్లాలో హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

- **రూ.338 కోట్లతో ఇబ్రహీంపట్నం,మేడ్చల్,మహేశ్వరం నియోజకవర్గాల్లో నాలుగు లేన్ల రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన**

**హైదరాబాద్ వెలుతురు జూలై 06:**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారి సూచన మేరకు రూ.338 కోట్ల వ్యయంతో హ్యామ్ (HAM) విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి గౌరవ శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు 2026 జులై 07, మంగళవారం ఉదయం 10:00 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు.ఈ ప్రతిష్టాత్మక రహదారి ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన, నాణ్యమైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపు లభించనుంది.



**శంకుస్థాపన చేయనున్న రహదారి పనులు**

**హయత్‌నగర్ – తొర్రూరు – కోహెడ – అనాజ్‌పూర్ వరకు**

**అనాజ్‌పూర్ – అబ్దుల్లాపూర్‌మెట్ – బండరావిర్యాల వరకు**

**హయత్‌నగర్ – కుంట్లూరు – పసుమాముల – తారామతిపేట వరకు**

**సాగర్ రోడ్డు – ఇంజాపూర్ – తొర్రూరు – బ్రాహ్మణపల్లి – రాగన్నగూడ వరకు**

**సాగర్ రోడ్డు – ఇంజాపూర్ – హయత్‌నగర్ వరకు**

ప్రజా ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, గ్రామీణ–పట్టణ ప్రాంతాలను అనుసంధానించే రహదారులను ఆధునికీకరించే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ రూ.338 కోట్ల రహదారి ప్రాజెక్టు ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం ప్రాంతాల భవిష్యత్ అభివృద్ధికి మైలురాయిగా నిలవనుంది.

# మహారాష్ట్ర అతలాకుతతం..








- ముంచెత్తిన వర్షాలు.. స్తంభించిన రాకపోకలు
- పుణె-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేపై కొండచరియలు
- రెండు ప్రధాన హైవేలపై ట్రాఫిక్ నిలిపివేత
- 16 రైళ్లు రద్దు.. విమానాలకు అంతరాయం
- ముంబయి సహా నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- భారీ వర్షాలతో విద్యాసంస్థలకు సెలవు
- మన్‌కుర్ద్‌లో భవనం కూలి ఆరుగురు మృతి
- మృతుల్లో ఐదుగురు చిన్నారులు
- ప్రజలు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచన
- ట్రాఫిక్ అడ్వైజరీలు పాటించాలని హెచ్చరిక
- మరో 24 గంటలు భారీ వర్షాల హెచ్చరిక

**మహారాష్ట్ర వెలుతురు జూలై 06:**

మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా ముంబయి, పుణె, ఠాణె, నవీ ముంబయి, పాల్ఘర్ జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తుండటంతో సాధారణ జనజీవనం తీవ్రంగా దెబ్బతింది. పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. కొండ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలు స్తంభించాయి.దేశంలో అత్యంత రద్దీగా ఉండే పుణె-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేపై పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో అధికారులు వెంటనే ట్రాఫిక్‌ను నిలిపివేశారు. అలాగే ఓల్డ్ ముంబయి-పుణె హైవేపై కూడా రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఈ మార్గాల్లో ప్రయాణించవద్దని మహారాష్ట్ర స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఎస్‌ఆర్‌డీసీ) సూచించింది. ప్రయాణికులు ట్రాఫిక్ అడ్వైజరీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరింది.భారీ వర్షాల ప్రభావం రైల్వే, విమాన రవాణాపైనా పడింది. ట్రాక్‌లపై నీరు నిల్వ ఉండటం, భద్రతా కారణాల దృష్ట్యా సోమవారం నడవాల్సిన 16 రైళ్లను అధికారులు రద్దు చేశారు. మరికొన్ని రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. మరోవైపు ముంబయి విమానాశ్రయంలో కూడా ప్రతికూల వాతావరణం కారణంగా పలు విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి.ఇక రానున్న గంటల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ముంబయి, ఠాణె, నవీ ముంబయి, పాల్ఘర్ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల్లో సోమవారం విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది.ఇదిలా ఉండగా ముంబయి శివారులోని మన్‌కుర్ద్ ప్రాంతంలో ఆదివారం రాత్రి భారీ వర్షాల కారణంగా ఓ నివాస భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఐదుగురు చిన్నారులు సహా మొత్తం ఆరుగురు మృతి చెందారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.మరో 24 గంటల పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగనున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

# కీవ్‌పై రష్యా భీకర దాడులు.. 12 మంది మృతి



- బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్‌లతో కీవ్‌పై విరుచుకుపడ్డ రష్యా
- దాడుల్లో 12 మంది మృతి.. పలువురికి తీవ్ర గాయాలు
- అనేక భవనాలు ధ్వంసం.. శిథిలాల కింద చిక్కుకున్న బాధితులు
- సైనిక, పారిశ్రామిక, ఇంధన కేంద్రాలే లక్ష్యమని రష్యా ప్రకటన
- ఉక్రెయిన్ దాడులకు ప్రతిస్పందనగానే చర్యలని మాస్కో వెల్లడి
- దాడులకు ముందే ప్రజలను అప్రమత్తం చేసిన జెలెన్‌స్కీ
- అమెరికా స్వాతంత్ర్య వేడుకల తర్వాత దాడులపై నిఘా హెచ్చరికలున్నాయని వెల్లడి
- ట్రంప్—పుతిన్ 90 నిమిషాల ఫోన్ చర్చల అనంతరం దాడులు
- ట్రంప్‌తో జెలెన్‌స్కీ కూడా ఫోన్‌లో చర్చలు
- నాటో శిఖరాగ్ర సదస్సుకు ముందు ఉక్రెయిన్‌లో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు

**ఉక్రెయిన్ వెలుతురు జూలై 06:**

ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా మరోసారి భారీ స్థాయిలో దాడులు చేసింది. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్‌లతో జరిగిన ఈ దాడుల్లో కనీసం 12 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. అనేక భవనాలు ధ్వంసమయ్యాయని, శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు ముమ్మరంగా పనిచేస్తున్నాయని కీవ్ అధికారులు తెలిపారు.కీవ్‌లోని సైనిక-పారిశ్రామిక కేంద్రాలు, ఇంధన, విద్యుత్ మౌలిక సదుపాయాలనే లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. తమ దేశంలోని పౌర మౌలిక సదుపాయాలపై ఉక్రెయిన్ జరిపిన దాడులకు ప్రతిస్పందనగానే ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొంది.అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం ముగిసిన వెంటనే ఉక్రెయిన్‌పై భారీ దాడులు చేసేందుకు రష్యా ప్రణాళిక రూపొందించిందని తమ నిఘా వర్గాలు ముందే హెచ్చరించాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆయన సూచించిన కొద్ది గంటల్లోనే ఈ దాడులు జరిగాయి.ఇదిలా ఉండగా, దాడులకు కొన్ని గంటల ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సుమారు 90 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే దిశగా సహకరిస్తానని ట్రంప్ ప్రతిపాదించినట్లు సమాచారం. అంతకుముందు ట్రంప్, జెలెన్‌స్కీతో కూడా ఫోన్‌లో చర్చలు జరిపారు.జులై 7 నుంచి తుర్కియే వేదికగా నాటో శిఖరాగ్ర సదస్సు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఈ దాడులు జరగడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఎస్ఐఆర్‌లో అక్రమాలు సీఈవోకు బీఆర్ఎస్ ఫిర్యాదు



- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నేతలు
- ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు వినోద్ కుమార్ వెల్లడి
- బీఎల్‌వోలు, బీఎల్ఏలతో సమన్వయం కోసం కమిటీ పనిచేస్తుందని స్పష్టం
- రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌వోల పనితీరుపై ఫిర్యాదులు అందాయని వ్యాఖ్య
- ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందడం లేదని ఆరోపణ
- ఎస్ఐఆర్ గడువును పొడిగించాలని ఎన్నికల అధికారులను కోరిన బీఆర్ఎస్
- డూప్లికేట్ ఓట్ల తొలగింపుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- ఓటర్ల పేర్ల నమోదులో గందరగోళంపై ఆందోళన వ్యక్తం
- కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి అంశాలను తీసుకెళ్తామని సీఈవో హామీ ఇచ్చినట్లు వెల్లడి
- బీఎల్‌వోలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని డిమాండ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 06:**

రాష్ట్రంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ అమలులో నెలకొన్న సమస్యలపై బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణతో పాటు బీఆర్ఎస్ నేతలు సోమా భరత్, కర్ణె ప్రభాకర్, వై. సతీశ్ రెడ్డి, సుమిత్రానంద్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు పార్టీ తరఫున ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలతో సమన్వయం చేసుకుంటూ పనిచేసేందుకు ఈ కమిటీని నియమించామని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌వోల పనితీరుపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు తమకు అందాయని ఆయన పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందించడం లేదని, ఇంకా చాలా మందికి ఫారాలు చేరలేదని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేసేందుకు కేవలం 20 రోజుల గడువు మాత్రమే ఉండటంతో గడువును పొడిగించాలని సీఈవోను కోరినట్లు తెలిపారు.డూప్లికేట్ ఓట్ల తొలగింపులో ఎన్నికల యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉన్న సందర్భాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు చెప్పారు. ఓటర్ల పేర్ల నమోదులో నెలకొన్న గందరగోళాన్ని నివారించేందుకు బీఎల్‌వోలకు తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని కూడా విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు.తాము ప్రస్తావించిన అంశాలను కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు వినోద్ కుమార్ తెలిపారు.

# సంధ్య థియేటర్ కేసు.. అల్లు అర్జున్‌కు వర్చువల్ హాజరుకు కోర్టు అనుమతి



- నాంపల్లి కోర్టులో సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు విచారణ
- ముంబైలో షూటింగ్‌లో ఉండటంతో వర్చువల్‌గా హాజరైన అల్లుఅర్జున్
- హీరో తరపు పిటిషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కోర్టు
- కొందరు నిందితులు వ్యక్తిగత కారణాలతో విచారణకు గైర్హాజరు
- తదుపరి విచారణను జులై 29కు వాయిదా వేసిన న్యాయస్థానం
- 23 మంది నిందితులపై 500 పేజీల ఛార్జ్‌షీట్ సమర్పించిన పీపీ
- గత విచారణలోనూ వర్చువల్‌గా హాజరైన అల్లుఅర్జున్
- వ్యక్తిగతంగా హాజరుకావాలని ముందుగా నోటీసులు జారీ చేసిన పోలీసులు
- షూటింగ్ షెడ్యూల్ కారణంగా కోర్టును ఆశ్రయించిన హీరో
- వాదనలు విన్న అనంతరం వర్చువల్ హాజరుకు అనుమతి

**హైదరాబాద్ వెలుతురు జూలై 06:**

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో సోమవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా టాలీవుడ్ హీరో అల్లుఅర్జున్‌కు వర్చువల్‌గా విచారణకు హాజరయ్యేందుకు న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం ముంబైలో షూటింగ్‌లో ఉండటంతో ప్రత్యక్షంగా హాజరుకాలేనని ఆయన తరపు న్యాయవాది కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, న్యాయస్థానం అందుకు ఆమోదం తెలిపింది.ఈ కేసులో కొందరు నిందితులు వ్యక్తిగత కారణాలతో విచారణకు హాజరుకాకపోవడంతో తదుపరి విచారణను ఈ నెల 29కు వాయిదా వేసింది. అలాగే 23 మంది నిందితులకు సంబంధించిన 500 పేజీల ఛార్జ్‌షీట్ ప్రతులను ప్రభుత్వ తరపు న్యాయవాది కోర్టుకు సమర్పించారు.కాగా, గత విచారణలోనూ అల్లుఅర్జున్ వర్చువల్‌గా హాజరయ్యారు. ఈసారి వ్యక్తిగతంగా హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేసినప్పటికీ, షూటింగ్ నిమిత్తం ముంబైలో ఉన్నందున వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యేందుకు అనుమతి కోరారు. వాదనలు పరిశీలించిన కోర్టు ఆయన అభ్యర్థనను మంజూరు చేసింది.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి



- ఎన్‌టీఏపై ఎన్ఎస్‌యూఐ మూడు డిమాండ్లు
- పేపర్ లీక్‌లపై సమగ్ర దర్యాప్తు కోరిన ఎన్ఎస్‌యూఐ
- విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టాలన్న డిమాండ్
- ఎన్‌టీఏ ఏర్పాటుపై కేంద్రాన్ని నిలదీత
- యువత కోసం రెగ్యులర్ జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని విజ్ఞప్తి
- పరీక్షల నియామకాలకు అకడమిక్ క్యాలెండర్ కావాలన్న ఎన్ఎస్‌యూఐ
- నిరుద్యోగ యువతకు భరోసా కల్పించాలని డిమాండ్
- కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు

**ఢిల్లీ వెలుతురు జూలై 06:**

జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) పనితీరు, వరుసగా వెలుగుచూస్తున్న పేపర్ లీక్ ఘటనల నేపథ్యంలో ఎన్ఎస్‌యూఐ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఎన్ఎస్‌యూఐ ఇన్‌చార్జి కన్నయ్య కుమార్ కేంద్ర ప్రభుత్వం వెంటనే మూడు కీలక డిమాండ్లను అమలు చేయాలని కోరారు.మొదటగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీక్ మాఫియాతో ఆయనకు ఉన్న సంబంధాలపై సమగ్ర, స్వతంత్ర దర్యాప్తు జరపాలని కోరారు. దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణపై విద్యార్థులు విశ్వాసం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.రెండో డిమాండ్‌గా దేశ విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టాలని కన్‌హయ్య కుమార్ పేర్కొన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేశారని, అయితే ఆ ప్రక్రియను కొనసాగించకుండా ఎన్‌డీఏ ప్రభుత్వం ఏకపక్షంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను ఏర్పాటు చేసిందని విమర్శించారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పరీక్షల వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలని కోరారు.మూడో డిమాండ్‌గా దేశంలోని నిరుద్యోగ యువత కోసం క్రమబద్ధమైన జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పరీక్షలు, ఉద్యోగ నియామక ప్రక్రియలకు సంబంధించి స్పష్టమైన అకడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనివల్ల విద్యార్థులు, ఉద్యోగార్థులకు అనిశ్చితి తొలగి, పారదర్శకంగా నియామక ప్రక్రియలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఎన్ఎస్‌యూఐ హెచ్చరించింది.

# జమ్మూకాశ్మీర్‌లో క్లౌడ్‌బరస్ట్ బీభత్సం

- కిష్టవార్‌లో భారీ వర్షాలతో క్లౌడ్‌బరస్ట్
- క్వార్ జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద తీవ్ర విధ్వంసం
- కొండచరియలు విరిగిపడి బురద మేటలు, రాళ్లు, శిథిలాలతో ప్రాజెక్టు ప్రాంతం దెబ్బ
- బురదలో చిక్కుకున్న వాహనాలు, ట్రక్కులు
- ట్యాంకర్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- జమ్మూ—కిష్టవార్ జాతీయ రహదారి మూసివేత

**జమ్మూకాశ్మీర్ వెలుతురు జూలై 06:**

జమ్మూకాశ్మీర్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. కిష్టవార్ జిల్లాలోని క్వార్ జలవిద్యుత్ ప్రాజెక్టు సమీపంలో సోమవారం క్లౌడ్‌బరస్ట్ సంభవించడంతో భారీగా వరదనీరు, బురద ప్రవహించి తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా కురిసిన వర్షానికి కొండచరియలు విరిగిపడటంతో ప్రాజెక్టు పరిసర ప్రాంతమంతా బురద, భారీ రాళ్లు, శిథిలాలతో నిండిపోయింది.ఈ ఘటనతో ప్రాజెక్టు ప్రాంతంలో నిలిపి ఉంచిన అనేక వాహనాలు, ట్రక్కులు, ట్యాంకర్లు బురదలో చిక్కుకుపోయాయి. కొన్ని వాహనాలు పూర్తిగా బురదలో కూరుకుపోగా, రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఘటన సమాచారం అందుకున్న అధికారులు, విపత్తు నిర్వహణ బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించాయి.క్లౌడ్‌బరస్ట్ ప్రభావంతో జమ్మూ—కిష్టవార్ జాతీయ రహదారిపై కూడా భారీగా రాళ్లు, మట్టి పేరుకుపోవడంతో రహదారిని తాత్కాలికంగా మూసివేశారు. రహదారిని వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు భారీ యంత్రాలతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కొండ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాలు కొనసాగుతున్నందున అవసరం లేకుండా ప్రయాణాలు చేయవద్దని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు.



# ఏళ్ల తరబడి ఫైళ్లు పెండింగ్‌లో పెడితే ఎలా?

- ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు
- డివిజన్ స్థాయిలో పరిష్కరించగల ఒక్క ఫైల్ కూడా పెండింగ్‌లో ఉండొద్దు
- రెవెన్యూ, అటవీ అధికారులపై మంత్రి జూపల్లి ఆగ్రహం
- కొల్లాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ.. 16 అంశాలపై సమీక్ష

**కొల్లాపూర్, వెలుతురు జూలై 6:**

''ప్రజలు ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే.. అధికారులు ఫైళ్లను పెండింగ్‌లో పెడితే ఎలా? ఒక టేబుల్ నుంచి మరో టేబుల్‌కు ఫైళ్లను పంపించడం పరిపాలన కాదు. ప్రజల సమస్యలకు చట్టబద్ధమైన, శాశ్వత పరిష్కారం చూపడమే పరిపాలన'' అని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ అనవసరంగా ఫైళ్లను పెండింగ్‌లో ఉంచితే సహించేది లేదని హెచ్చరించారు.కొల్లాపూర్ నియోజకవర్గంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ, అటవీ, భూ సమస్యలపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఆర్డీఓ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఒరిజినల్ ఫైళ్లు, నోట్ ఫైళ్లు, సంబంధిత రికార్డులను తెప్పించి ఒక్కో అంశాన్ని స్వయంగా పరిశీలించారు. ఫైళ్లు ఏ దశలో ఉన్నాయి? ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి? ఎవరి వద్ద ఆగిపోయాయి? పరిష్కారానికి ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారు? అంటూ సంబంధిత అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. గతంలో పలుమార్లు సమీక్షలు నిర్వహించి ఆదేశాలు ఇచ్చినా అనేక అంశాలు ఇప్పటికీ అదే దశలో ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ''ఒక ఫైల్ మీ వద్దకు వస్తే మరో అధికారికి పంపించి చేతులు దులుపుకోవడం కాదు. క్షుణ్ణంగా పరిశీలించి చట్టబద్ధమైన పరిష్కారం చూపాలి'' అని స్పష్టం చేశారు.



**16 అంశాలపై క్షుణ్ణంగా ఆరా**

ముక్కిడిగుండం, సోమశిల, రామాపురం, ఎల్లూరు, జటప్రోలు, గోపాలపురం శివారు, సింగోటం, కొల్లాపూర్, చింతలపల్లి, సోమశిల రోడ్డు, చౌటబెట్ల శివారుకు సంబంధించిన పోడు పట్టాలు, ఆర్ఓఎఫ్ఆర్, రెవెన్యూ–అటవీ భూ వివాదాలు, జాయింట్ సర్వేలు, పట్టాదారు హక్కులు, లావోని పట్టాలు, భూ రికార్డుల సవరణ, ఫోడి సర్వే, పీఓటీ రెగ్యులరైజేషన్, భూభారతి, వ్యవసాయ మార్కెట్ యార్డు, హార్టికల్చర్ పాలిటెక్నిక్, పర్యాటక ప్రాజెక్టులు సహా మొత్తం 16 అంశాలపై మంత్రి సమీక్షించారు.

**అర్జిదారులను పిలిపించి.. అక్కడికక్కడే నిర్ణయం**

ప్రతి అంశానికి సంబంధించిన అర్జిదారులను పిలిపించి, గ్రామ పాలన అధికారి (జీపీఓ) నుంచి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, సర్వే అధికారులు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది వరకు సంబంధిత అధికారులందరూ ఒకేచోట కూర్చొని సమస్యలను పరిశీలించాలని ఆదేశించారు. ఎవరి స్థాయిలో ఏ నివేదిక ఇవ్వాలి? ఎవరు ఏ చర్య తీసుకోవాలి? అనే విషయాలను అక్కడికక్కడే నిర్ణయించి రికార్డు చేయాలని సూచించారు.

''డివిజన్ స్థాయిలో పరిష్కరించగల ఒక్క ఫైల్ కూడా పెండింగ్‌లో ఉండకూడదు. నివేదికలను నమోదు చేసి ఫైళ్లను వెంటనే పరిష్కరించాలి. కలెక్టర్ స్థాయిలో నిర్ణయం అవసరమైన అంశాలకు పూర్తి ప్రతిపాదనలు, రికార్డులతో ఈరోజే పంపాలి. అనవసరంగా ఫైళ్లను పెండింగ్‌లో ఉంచితే సహించను'' అని హెచ్చరించారు.

**ప్రతి ఫైల్‌కు కార్యాచరణ.. గడువు**

ప్రతి ఫైల్ ఏ దశలో ఉంది? ఎందుకు పెండింగ్‌లో ఉంది? ఏ అధికారి వద్ద ఉంది? తదుపరి ఎవరు ఏ చర్య తీసుకోవాలి? ఎంత గడువులో పరిష్కరించాలి? అనే వివరాలతో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఆదేశించారు.క్యాంపు కార్యాలయం నుంచి వచ్చే ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని సూచించారు. క్షుణ్ణంగా విచారణ జరిపేందుకు కొంత సమయం తీసుకున్నా అభ్యంతరం లేదని, ఫైళ్లను మాత్రం అనవసరంగా పెండింగ్‌లో ఉంచొద్దని స్పష్టం చేశారు. ప్రజలు మళ్లీ అదే సమస్యతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా దీర్ఘకాలిక సమస్యలకు చట్టబద్ధమైన, శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు.సమీక్షలో రెవెన్యూ, సర్వే, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సైబరాబాద్‌లో ట్రాఫిక్‌ను మరింత సురక్షితంగా, సాఫీగా నిర్వహించేందుకు సమీక్షా సమావేశం





**సైబరాబాద్ వెలుతురు జూలై 06:**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్., అధ్యక్షతన ట్రాఫిక్ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ ట్రాఫిక్‌ను మరింత సులభతరం చేయడం, ప్రజలకు అంతరాయం లేకుండా సాఫీగా రాకపోకలు సాగేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.వర్షాకాలంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో పెండింగ్ పనులను సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రాంగ్ రూట్ ప్రయాణాలు, ప్రమాదకర డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్రీ లెఫ్ట్‌ల వద్ద వాహనాల నిలుపుదలను నివారించి ట్రాఫిక్ నిరంతరాయంగా కొనసాగేలా చూడాలని, యూ–టర్న్‌ల వద్ద ట్రాఫిక్ ఫ్రీ మూవ్‌మెంట్‌కు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.సమావేశం అనంతరం జాయింట్ సీపీ గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, బాటిల్‌నెక్ పాయింట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి విలేజ్, రాడిసన్ జంక్షన్, ఏఎంబీ మాల్ జంక్షన్, కొత్తగూడ జంక్షన్, అంజయ్యనగర్, లేబర్ అడ్డా ప్రాంతాలను సందర్శించి ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు.పరిశీలన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీకి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ట్రాఫిక్‌ను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా బాటిల్‌నెక్ ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారాల కోసం కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కేబుల్ బ్రిడ్జి నుంచి ఐకియా ఫ్లైఓవర్ వరకు ఉన్న రెగ్యులర్ "వీఐపీ, వీవీఐపీ" మార్గాన్ని పరిశీలించి ట్రాఫిక్ ప్రవాహం, సిగ్నల్ నిర్వహణ, జంక్షన్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.పోలీస్ ఉన్నతాధికారులు, ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోలు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రోడ్లపై నిరంతరం అందుబాటులో ఉండాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని జాయింట్ సీపీ ఆదేశించారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, ప్రజల సౌకర్యం, సురక్షిత ప్రయాణమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.ఈ సమావేశం మరియు క్షేత్రస్థాయి పరిశీలనలో ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్., ట్రాఫిక్–1 డీసీపీ శ్రీ ఎస్. రవికుమార్, అదనపు డీసీపీ ట్రాఫిక్–1 శ్రీ జి. హనుమంతరావు, ఏడీసీపీలు, ఏసీపీలు, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కుమ్మరివాడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ

- హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్

**హైదరాబాద్ వెలుతురు జూలై 06:**

జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ సోమవారం రోజున కుమ్మరివాడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా DM&HO గారు హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, లాబొరేటరీ కేంద్రాన్ని, వివిధ రికార్డులు మరియు పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గర్భిణీల స్త్రీల సంరక్షణ, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధులు నియంత్రణ, జూలై నెల డెంగ్యూ మాసమైనందు వలన మలేరియా, డెంగీ, చికున్‌గునియా నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించి, ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని సూచించారు.





అదేవిధంగా శ్రీ జగదంబ మహంకాళి దేవాలయము ఆషాఢ జాతర బోనాల ఉత్సవాలు – 2026 సందర్భంగా,గోల్కొండ పరిధిలో భక్తులకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి, వాటిని సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమములో డాక్టర్ ఎన్. మురళీధర్, ఎస్ పి హెచ్ ఓ గారు మరియు వైద్యాధికారి, సిబ్బంది హాజరైనారు.

# సినీ హీరో రోషం బాలుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్

**హైదరాబాద్ వెలుతురు జూలై 06:**

తెలంగాణ ఉద్యమకారుడు, సినీ హీరో రోషం బాలు పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో సినీరంగం నుండి రోషం బాలు అనేక ఉద్యమంలో కీలకంగా పాల్గొని స్వరాష్ట్ర సాధనలో తన వంతు పాత్ర పోషించాడని కేటీఆర్ గుర్తుకు చేశారు.



# ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కి కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూలై 06:**

తెలంగాణ శాసనసభ అసెంబ్లీ ప్రాంగణంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గారికి కేటాయించిన ప్రత్యేక కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,ఈ సందర్భంగా ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన వేముల వీరేశం గారికి మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రజా సమస్యల పరిష్కారంలో, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో మరింత విజయవంతంగా బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడుగు బలహీన వర్గాల విద్యార్థుల ఉసురు తగులుతుంది

- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 06:**

ఫీజు బకాయిలు విడుదల చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులను, కాలేజీ యాజమాన్యాలను కోర్టుల చుట్టూ తిప్పడం మీకేమైనా న్యాయమేనా ?? ప్రజాపాలన అని చెప్పుకుంటూ 20 లక్షల మంది విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిబడుగు బలహీన వర్గాల విద్యార్థుల ఉసురు తగులుతుంది నీకు రేవంత్ రెడ్డి బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్.



# ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత


తెలంగాణ రాష్ట్రంలో చాలా వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత నెలకొంది. అన్ని డిపార్ట్మెంట్స్ సంబంధించిన డాక్టర్లు లేరు ఉన్నా వారు సమయానికి అందుబాటులో ఉండరు. గడచిన వారం రోజుల క్రితం నల్గొండ జిల్లా కేంద్రంలోని గొల్లగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో కూడ డాక్టర్ల కొరత నెలకొంది. ప్రసూతి కొరకు ఒక మహిళ హాస్పిటల్లో జాయిన్ కాగా సంబంధిత గైనకాలజిస్ట్ అందుబాటులో లేక సరైన సూచనలు సలహాలు అందక పూర్తిగా తెల్ల రక్త కణాలు పడిపోయి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుంది. నిరుపేదలు అతి సాధారణ మధ్యతరగతి ప్రజలు సరైన తిండికి బట్టకు నోచుకోని జనాలు పోషకాహార లోపం వల్ల ఇలాంటి సమస్యలను ఎదుర్కొని తట్టుకొని ఆసుపత్రిలో జాయిన్ అయితే అక్కడ పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది.

నల్గొండ జిల్లా కేంద్రంలోని గొల్లగూడ ఆసుపత్రికి ప్రధానంగా ప్రసూతి కాన్పుల కొరకు చాలామంది మహిళలు జిల్లా నలుమూలల నుంచి ఈ ఆసుపత్రికి వస్తుంటారు కానీ వారికి సంబంధించిన గైనకాలజిస్ట్ డాక్టర్లు సమయానికి అందుబాటులో ఉండరు. దీని మూలంగా ఈ ఆసుపత్రుని నమ్మి వచ్చిన చాలా మంది మహిళలు చెప్పలేని గోస తీస్తున్నారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా ప్రభుత్వ ఆసుపత్రిలోకి పేద మధ్యతరగతి ప్రజలే అధికంగా వస్తారు అక్కడ డాక్టర్లు అందుబాటులో లేని మూలంగా డబ్బులు వెచ్చించి వేరే ఆసుపత్రికి వెళ్లలేరు అక్కడ ఉండి వైద్యం చేయించుకోలేరు ముందు పోతే నొయ్యి వెనుక పోతే గొయ్యి అన్న మాదిరి వీరి పరిస్థితి చాలా దీనావస్థలో ఉంది.

ఈ కారణం చేత ప్రాణాలను అరిచేతిలో పట్టుకుని భగవంత నీవే దిక్కు అని గాలిలో దీపం లాగా ఆసుపత్రి ముందు నిద్రాహారాలు మా అని అనేకమంది పడిగాపులు కాస్తున్నారు.

మానవ జీవితం ఎంతో ప్రత్యేకమైనది మనిషి జీవితం ఇంకా ఎంతో విలువైనది ప్రభుత్వ పెద్దలు ప్రభుత్వ అధికారులు దయచేసి పేదల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దు సంబంధిత ఆరోగ్యశాఖ మార్చిలు అధికారులు దీనిపై రివ్యూ నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ జిల్లా నుండి ఇద్దరు మంత్రులు ప్రభుత్వంలో ప్రధాన భూమిక పోషిస్తున్నారు అయినా కూడా ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేవు అంటే ప్రభుత్వానికి ఇది చెరగని మచ్చలాగా తయారవుతుంది. కనుక దయచేసి పేదల పక్షాన దయవుంచి జిల్లా మంత్రులు అధికారులు నెలకొకసారి రివ్యూ నిర్వహించి ప్రభుత్వ కార్యాలయాలు ఎలా నడుస్తున్నాయి ఎలా ముందుకు సాగుతున్నాయి అధికారుల పని తీరు ఎలా ఉందని ప్రతి నెల రివ్యూ నిర్వహించాలి. ప్రభుత్వ ఫలాలను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

ఇట్లు
ఈద శేఖర్ 7036997589



# 'లెనిన్' కోసం ఎన్టీఆర్.. తన పార్ట్ పూర్తి చేశారు..



అఖిల్ కథానాయకుడిగా మురళీ కిషోర్ దర్శకత్వంలో రూపొందిన విలేజ్ యాక్షన్ డ్రామా 'లెనిన్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. జులై 10న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు అగ్ర కథానాయకుడు నాగార్జున వాయిస్ ఓవర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'లెనిన్' కథను వెండితెర ప్రేక్షకులకు పరిచయం చేసే బాధ్యత ఎన్టీఆర్ తీసుకున్నారు. శ్రీరామాపురం, భారతంమిట్ట గ్రామాలు.. అందులోని మనుషులను తీరు తెన్నులను ఎన్టీఆర్ తన వాయిస్ ద్వారా వివరిస్తారు. సోమవారం ఇందుకు సంబంధించిన పని పూర్తి చేశారు. ఈ సందర్భంగా అఖిల్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## నా కొడుకు గర్వపడే సినిమాలే చేస్తా: కాజల్ అగర్వాల్



'ది ఇండియా స్టోరీ', 'రామాయణ' చిత్రాలతో బిజీగా ఉన్న కాజల్, తల్లి అయ్యాక సినిమాలు ఎంపిక చేసుకునే విధానం మారిపోయిందని తెలిపారు. కుమారుడు నీల్ రాకతో బాధ్యత పెరిగిందని అన్నారు.

''ఇప్పుడు ఏ ప్రాజెక్ట్ తీసుకున్నా నా కొడుకు దృష్టి నుంచి ఆలోచిస్తాను. 'మమ్మా చేసిన గ్రేట్ సినిమా ఇది' అని అతను గర్వంగా చెప్పుకోవాలి. అందుకే ఎలాంటి సినిమాలు చెయ్యాలి?అనే విషయంపై నాకు ఎక్కువ బాధ్యత, అవగాహన వచ్చాయి. నీల్‌కు రామాయణం అంటే బాగా ఇష్టం. ఇంట్లో రోజూ రామలీలా చూస్తాడు. నేను 'రామాయణ' లో మండోదరిగా నటిస్తున్నానని చెప్పగానే ఉత్సాహపడ్డాడు. ఆసక్తికర విషయమేంటంటే అతనికి ఇష్టమైన పాత్ర రావణుడు. పార్ట్ 2 వచ్చేసరికి అతనికి 5 ఏళ్లు వస్తాయి. నీల్ థియేటర్‌లో చూసే మొదటి సినిమా ఇదే అవుతుంది.'' అని తెలిపారు. స్టార్ హీరో యశ్, నటుడు రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'రామాయణ: పార్ట్ 1' దీపావళికి విడుదల కానుంది. ఈ సినిమాకు నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు.

ఇక, చేతన్ డీకే దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ఇండియా స్టోరీ'లో కాజల్, శ్రేయస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఆ సినిమా గురించి కాజల్ మాట్లాడుతూ.. ''పురుగు మందులను వినియోగించడం వల్ల ఎలాంటి నష్టాలు జరుగుతున్నాయి? కల్తీ ఆహార సమస్య ఎంత మంది ప్రాణాలను బలి తీసుకుంటుందనే అంశాల ఆధారంగా సాగే 'ది ఇండియా స్టోరీ' కథ నన్ను ఆలోచింపజేసింది. తినే ఆహారంలో ఏముందో మనం లోతుగా పరిశీలించం. ఈ సినిమా రీసెర్చ్‌తో నాకు ఆ అవగాహన వచ్చింది. అప్పటికప్పుడే వంటగదిలో ఏ వస్తువులు ఉంచాలో, నీల్‌కు ఏది ఇవ్వకూడదో నిర్ణయించుకున్నాను'' అని చెప్పారు. జులై 24న ఈ సినిమా థియేటర్లలోకి రాబోతుంది. ఇందులో కాజల్ న్యాయవాదిగా కనిపించనున్నారు.

# టపాసుల పండగకి శ్రీలీల సందడి?



తనదైన నటనతో కుర్రకారుని ఆకట్టుకుంటోంది అందాల తార శ్రీలీల. తన స్టెప్పులతో ఇప్పటికే దక్షిణాదిలో మంచి క్రేజ్‌ను సంపాదించుకున్న ఆమె.. బాలీవుడ్‌లో కూడా పలు ప్రాజెక్టుల్ని అంగీకరించింది. ఇందులో భాగంగానే ఆమె, ఇబ్రహీం అలీ ఖాన్ 'దిలేర్' అనే చిత్రంలో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. కునాల్ దేశ్‌ముఖ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణను పూర్తి చేసుకుందీ సినిమా. తాజాగా దీన్ని ఈ ఏడాది దీపావళి సందర్భంగా నవంబరులో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తుందట చిత్రబృందం. త్వరలో ఈ విషయంపై అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతుంది. మడాక్ ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. మరి ఈ టపాసుల పండగకి ఇబ్రహీంతో కలిసి శ్రీలీల తెరపై చేసే సందడి ఎలా ఉంటుందో తెలియాలంటే సినిమా వచ్చే వరకూ వేచి చూడాల్సిందే. ప్రస్తుతం శ్రీలీల ఖాతాలో 'ఓమ్' చిత్రముంది.

# సంజూ శాంసన్ అవుట్.. వైభవ్ ఇన్



**జింబాబ్వే టీ20 సిరీస్‌కు భారత జట్టు ప్రకటన**

జింబాబ్వే పర్యటనలో జరగబోయే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం భారత క్రికెట్ జట్టును బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా అధికారికంగా ప్రకటించింది. ఈ జట్టు ఎంపికలో సెలక్టర్లు కొన్ని సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. సీనియర్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌ను జట్టు నుండి తప్పించగా.. ఇటీవల ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి చోటు కల్పించారు.

ఇంగ్లాండ్ పర్యటన ముగిసిన వెంటనే భారత జట్టు జింబాబ్వేతో తలపడనుంది. ఈ మూడు టీ20 మ్యాచ్‌లు జూలై 23, 25, 26 తేదీలలో హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరగనున్నాయి. ఈ సిరీస్‌కు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, తిలక్ వర్మకు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. వికెట్ కీపర్లుగా ఇషాన్ కిషన్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌లు జట్టులో చోటు దక్కించుకున్నారు. అలాగే దేశీవాళీ క్రికెట్‌లో రాణించిన హర్ష్ దూబేకు తొలిసారి అంతర్జాతీయ టీ20 జట్టు నుండి పిలుపు వచ్చింది.

ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన సంజూ శాంసన్ మరోసారి జట్టులో స్థానం కోల్పోయాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20లోనే సంజూ స్థానంలో వైభవ్ అరంగ్రేటం చేయంగా, ఇప్పుడు ఏకంగా జింబాబ్వే సిరీస్ నుండే శాంసన్‌ను పక్కనబెట్టారు. మరోవైపు, ఐపీఎల్ సీజన్లలో రికార్డు స్థాయిలో 776 పరుగులు సాధించి, అత్యంత పిన్న వయసులో 'ఆరెంజ్ క్యాప్' గెలిచిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీపై ప్రస్తుతం అందరి కళ్లూ ఉన్నాయి. అంతర్జాతీయ వేదికపై ఈ యువ బ్యాటర్ ఏ మేరకు రాణిస్తాడో చూడాలి.

**జింబాబ్వే సిరీస్‌కు భారత టీ20 జట్టు:**
శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, సూర్యాంశ్ శెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యష్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్).

# ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌కు నితీష్ రెడ్డి దూరం, జట్టులోకి దూబే!



గాయం కారణంగా స్టార్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి ఇంగ్లాండ్‌తో జరగబోయే మూడు వన్డేల సిరీస్‌కు కూడా దూరమయ్యాడు. ఆయన స్థానంలో సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ శివమ్ దూబేను భారత వన్డే జట్టులోకి ఎంపిక చేసినట్లు బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బీసీసీఐ) కార్యదర్శి దేవజిత్ సైకియా సోమవారం అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో టీ20 సిరీస్ ఆడుతున్న దూబే, వన్డే సిరీస్ కోసం అక్కడే కొనసాగనున్నాడు.

చెన్నైలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్ సందర్భంగా నితీష్ కుమార్ రెడ్డికి తొడ కండరాల గాయం అయింది. ఈ గాయం నుండి ఆయన ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో ఇప్పటికే ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌లతో పాటు రాబోయే జింబాబ్వే పర్యటనకు కూడా దూరమయ్యాడు. నితీష్ కోలుకోవడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో సెలక్షన్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. రెండు సార్లు టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన శివమ్ దూబే ఇప్పటివరకు భారత్ తరఫున నాలుగు వన్డేలు ఆడాడు. ఆయన చివరిగా ఆగస్టు 2024లో శ్రీలంకపై వన్డే మ్యాచ్ ఆడాడు.

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జూలై 14న బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా మొదటి వన్డే మ్యాచ్ ప్రారంభం కానుంది. ఆ తర్వాత జూలై 16న కార్డిఫ్‌లో రెండో వన్డే, జూలై 19న ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానంలో చివరి వన్డే మ్యాచ్ జరుగుతాయి. ఈ సిరీస్ ముగిసిన వెంటనే శివమ్ దూబే జింబాబ్వే పర్యటనకు బయలుదేరుతాడు. జూలై 23 నుండి హరారే వేదికగా జింబాబ్వేతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది.

**భారత వన్డే జట్టు:**
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, శివమ్ దూబే.

# టీమిండియాకు చావో రేవో

**నేడు ఇంగ్లాండ్‌తో 3వ టీ20 మ్యాచ్**

భారత్, ఇంగ్లాండ్ పురుషుల జట్ల మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా అత్యంత కీలకమైన మూడో టీ20 మ్యాచ్ జూలై 7న (మంగళవారం) నాటింగ్‌హామ్‌లోని ప్రతిష్టాత్మక ట్రెంట్ బ్రిడ్జ్ మైదానంలో జరగనుంది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. అయితే, మాంచెస్టర్‌లో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సిరీస్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే భారత జట్టు ఈ మూడో మ్యాచ్‌లో ఖచ్చితంగా గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



రెండో టీ20లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. ఇషాన్ కిషన్ (49), అభిషేక్ శర్మ (43) రాణించడంతో 190/7 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ మ్యాచ్ ద్వారా 15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రం చేసిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ రెండు భారీ సిక్సర్లు కొట్టి (14 పరుగులు) అందరి దృష్టిని ఆకర్షించాడు. అయితే, లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ యువ బ్యాటర్ జాకబ్ బెథెల్ కేవలం 46 బంతుల్లోనే 76 పరుగులు చేసి అజేయంగా నిలవడంతో ఆతిథ్య జట్టు మరో ఓవర్ మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3 వికెట్లు పడగొట్టగా, అక్షర్ పటేల్ తన 100వ అంతర్జాతీయ టీ20 వికెట్ మైలురాయిని అందుకున్నాడు.

హై-స్కోరింగ్ పిచ్‌గా పేరొందిన నాటింగ్‌హామ్ వేదికపై టాస్ కీలక పాత్ర పోషించనుంది. భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 10:00 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. గత మ్యాచ్‌లో భారీగా పరుగులు సమర్పించుకున్న మిడిల్ ఓవర్ల బౌలింగ్‌ను చక్కదిద్దుకుని, బ్యాటింగ్ విభాగం అదే జోరును కొనసాగిస్తే భారత్ సిరీస్‌ను సమం చేసే అవకాశం ఉంది.

# అఖండ భారత్ కోసం ఆత్మబలిదానం చేసిన మహోన్నత జాతీయవాది: కుమార్ యాదవ్

**కూకట్ పల్లి, జూలై 6 వెలుతురు:**

విద్యావేత్త, జాతీయవాది, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని విజేత కళాశాల మీటింగ్ హాల్‌లో సోమవారం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేర యువ భారత్ సభ్యుడు, బీజేపీ యువ మోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో యువతకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ, డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ 1901 జూలై 6న పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో జన్మించారని తెలిపారు. దేశ సమైక్యత, అఖండ భారత నిర్మాణం కోసం జీవితాంతం పోరాడి ఆత్మబలిదానం చేసిన మహోన్నత జాతీయవాది ఆయన అని కొనియాడారు. జమ్మూ–కాశ్మీర్ పూర్తిస్థాయిలో భారతదేశంలో విలీనం కావాలని బలంగా ఆకాంక్షించిన శ్యామాప్రసాద్ ముఖర్జీ, "ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిషాన్ నహీ చలేంగే" అనే చారిత్రాత్మక నినాదాన్ని దేశానికి అందించారని గుర్తు చేశారు. కేవలం 33 ఏళ్ల వయస్సులోనే కలకత్తా విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టి యువతకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో కేంద్ర పరిశ్రమలు, సరఫరా శాఖ మంత్రిగా సేవలందిస్తూ దేశ రాజకీయ చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించారని కుమార్ యాదవ్ అన్నారు. యువత శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విజేత కళాశాల డీన్ నూకరాజు, ప్రిన్సిపాల్ కాత్యాయని, యువ నాయకులు పరశురాం, రేవంత్, కృష్ణ, వెంకటేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు.



# భవిష్యత్తులో ఎల్కతుర్తి మరింత అభివృద్ధిలో ముందంజ





- **రహదారి నిర్మాణంతో గ్రామాలకు కనెక్టివిటీ**
- **రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**
- **ఎల్కతుర్తి జంక్షన్ వద్ద మడిపల్లి ఎల్కతుర్తి జంక్షన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**ఎల్కతుర్తి వెలుతురు జూలై 06:**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం భవిష్యత్తులో అభివృద్ధిలో మరింత ముందంజలో నిలుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి జంక్షన్ వద్ద మడిపల్లి నుండి ఎల్కతుర్తి జంక్షన్ వరకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ. 13 కోట్లతో చేపట్టిన బీటి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్,కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, కుడా వైస్ చైర్‌పర్సన్ & హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీలతో కలసి సోమవారం శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రహదారి నిర్మాణం పూర్తయితే గ్రామాలకు మండల కేంద్రానికి రహదారి అనుసంధానం ( కనెక్టివిటీ) పెరుగుతుందన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రానికి కోర్టు, విద్యుత్ ఉపకేంద్రం, తహసీల్దార్ కార్యాలయాలు వస్తున్నాయన్నారు. తద్వారా ఎల్కతుర్తి మరింత అభివృద్ధిని భవిష్యత్తులో సాధిస్తుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఈ రహదారి నిర్మాణం ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రహదారి నిర్మాణానికి అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు సహకరించాలని కోరారు. రోడ్డు నిర్మాణం కావాలని నాయకులు ప్రజాప్రతినిధులు ప్రజలు దృష్టికి తీసుకువచ్చారని, దీంతో రహదారి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రహదారి అభివృద్ధి పనులను త్వరగా పూర్తి కావాలని సూచించారు. ఈ సందర్భంగా కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ రహదారి నిర్మాణంతో కనెక్టివిటీ పెరిగి గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, కుడా సీపీవో అజిత్ రెడ్డి లను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఎల్కతుర్తి నుండి దామెర వెళ్లే ప్రధాన రహదారిని మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

**మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ కు ఘన నివాళులు**

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి స్వర్గీయ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎల్కతుర్తి సర్పంచ్ లావణ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీ, ఉప సర్పంచ్ రాజు, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, తహసిల్దార్ ప్రసాదరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మంచాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాన మంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు

- **డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధన కోసం పని చేయాలి**
- **కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి**

**మంచాల వెలుతురు జూలై 06:**



మంచాల మండలం కేంద్రంలో భారత మాజీ ఉపప్రధాని స్వాతంత్ర సమరయోధుడు డాక్టర్ బా బు జగ్జీవన్ రామ్ 49వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎడ్మనరేందర్ రె డ్డి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసినివాళులర్పిం చారు ఈసందర్భంగా మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత ఉపప్రధాని స్వా తంత్ర సమర యోధుడు అణగారిన కులాల కోసం ఎంతో పోరాటం చేసిన గొప్పనాయకుడు దేశ ప్రజల కోసం ఎన్నోసేవలు చేసిన గొప్ప నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అడుగుజాడలోనడవాలి ఆయన ఆశయసాధన కోసం పనిచేయాలి అని అన్నారు కార్యక్రమంలో మంచాల మండలం మాజీ ఎంపీపీ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొర్ర శ్రీనివాస్ నాయక్ తిప్పాయిగూడ గ్రామ సర్పం చ్ హంసమ్మ కోమారయ్య యాదవ్ మంచాల గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్ చిత్తపూర్ గ్రామ సర్పంచ్ వింజమూరి అలివేలు రాంరెడ్డి పటేల్ చెరువుతండా సర్పంచ్ మెగావత్ రాజ్యల క్షి లక్ష్మణ్.నాయక్ మంచాల ఉపసర్పంచ్ పందుల లింగంగౌడ్ వార్డు సభ్యులు గ్యార జంగయ్య కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు రావుల శ్రీనివాస్ నాయకులు గ్యార జగన్ ఎరుకొండ రాములుఏర్పుల నరసింహ.గడ్డం శ్రీకాంత్ గ్యార శరత్ తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ సతీష్ గోపాతి

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 06:**



రామన్నపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్ ఐ గా సతీష్ గోపాతి. సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నల్లగొండ సిసిఎస్ లో విధులు నిర్వహించిన ఆయన రామన్నపేటలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం ముందు ప్రతి ఒక్కరు సమానమే అని ప్రజలకు భద్రత కల్పించడం శాంతి భద్రతలను సమర్థంగా నిర్వహించడం తన ప్రధాన లక్ష్యం అని చెప్పారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని సమస్యలు ఉంటే నిర్భయంగా పోలీసులకు సంప్రదించాలని సూచించారు.

# గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా. చంద్రశేఖర్...**
- **మనియర్‌పల్లిలో రూ.10 లక్షల ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 06:**

గ్రామాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ డా. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని మనియర్‌పల్లి గ్రామంలో రూ.10 లక్షల ఉపాధి హామీ (ఈజీఎస్/నరేగా) నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ బ్యాగారి రాజ్‌కుమార్ ఆహ్వానం మేరకు భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా డా. చంద్రశేఖర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి వసూలు చేసే ప్రతి రూపాయి పన్నులో కేంద్ర ప్రభుత్వం కేవలం 35 పైసలు మాత్రమే తిరిగి రాష్ట్రానికి ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలు చెల్లించే పన్నుల ద్వారానే ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని, మనియర్‌పల్లి గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేసి అన్ని రకాల అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు.సీసీ రోడ్డు పనుల భూమిపూజకు హాజరైన అతిథులను గ్రామ సర్పంచ్ బ్యాగారి రాజ్‌కుమార్ శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కోహిర్ మున్సిపల్ చైర్మన్ మ్యాతారి అశోక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లన్న పాటిల్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా, సర్పంచులు రాజ్‌కుమార్, విద్యాసాగర్, విష్ణువర్ధన్, ఉప సర్పంచ్ చింతల్‌ఘాట్ ఎం.డి. ఖలీల్, కోహిర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మీర్ ముజఫ్ఫర్ హుస్సైన్, కౌన్సిలర్లు అహ్మద్ బలాల్, మొహమ్మద్ హమీద్, భాగప్పతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# రైతు భరోసా నిధుల విడుదలలో రేవంత్ ప్రభుత్వం రికార్డు

- **కేవలం 6 రోజుల్లోనే రైతు భరోసా కింద 68.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,490.72 కోట్లు జమ**

**హైదరాబాద్, వెలుతురు జూలై 06:**



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ రికార్డు స్థాయిలో రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జూన్ 30న రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వం కేవలం ఆరు రోజుల వ్యవధిలోనే రూ.7,490.72 కోట్లను 68.37 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసి రికార్డు సృష్టించిందన్నారు.నేడు రైతు భరోసా పథకం కింద 6 నుంచి 7 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులకు రైతు భరోసా సాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి వెల్లడించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 68.37 లక్షల మంది రైతులు, 124.85 లక్షల ఎకరాల సాగుభూమికి సంబంధించి రైతు భరోసా ప్రయోజనం పొందినట్లు తెలిపారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఇప్పటికే ఐదు విడతల్లో 6 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులకు రైతు భరోసా అందించగా, నేడు 6 నుంచి 7 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులందరికీ సాయం అందించామని పేర్కొన్నారు. ఇప్పటివరకు రైతు భరోసా పథకం కింద మొత్తం 124.85 లక్షల ఎకరాలకు సంబంధించిన 68.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,490.72 కోట్లను ప్రభుత్వం జమ చేసినట్లు మంత్రి తెలిపారు.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com